'అభ్యర్థుల వ్యయాలు సమర్పించాలి'

పార్వతీపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల వ్యయాలకు సంబంధించిన వివరాలను తుది అకౌంట్స్‌కు సమర్పించాలని అరకు పార్లమెంటరీ ఎన్నికల వ్యయ పరిశీలకుడు గురుకరణ్‌సింగ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అకౌంట్ రీకన్సలేషన్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడారు. అభ్యర్థుల అకౌంట్స్ వివరాలు పూర్తిగా అందించాలన్నారు. కలెక్టర్ నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ...అభ్యర్థుల అకౌంట్స్ ఫైనలైజ్ కావాలన్నారు. ఈనెల 11వ తేదీ లోపు ఎన్నికల కమిషనర్‌కు అకౌంట్స్ వివరాలు పంపించాల్సి ఉంటుందన్నారు.

పింఛన్ల పండగ

- జిల్లాలో విజయవంతంగా పంపిణీ
- ఉదయం ఆరు గంటలకే లబ్ధిదారుల ఇళ్లకు సచివాలయ సిబ్బంది
- అవ్వాతాతల చేతికి రూ.7వేలు
- పింఛన్‌దారుల్లో వెల్లివిరిసిన ఆనందం
- మాట నిలబెట్టుకున్నారంటూ.. సీఎం చంద్రబాబును కొనియాడిన జిల్లావాసులు
- భాగస్వాములైన ప్రజాప్రతినిధులు, కూటమి శ్రేణులు



పార్వతీపురం మండలం ఎల్ఎన్‌పురంలో రూ.7 వేలు పింఛను అందుకున్న వృద్ధురాలు

పార్వతీపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ పంపిణీ పండగలా జరిగింది. పింఛను సొమ్ము చూడగానే అవ్వతాతలు మురిసిపోయారు. వారి మోములో ఆనందం వెల్లివిరిసింది. ముఖ్యమంత్రి చంద్రబాబుకు దీవెనలు అందించారు. సోమవారం ఉదయం ఆరు గంటలకు సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ అందించారు. తొలిరోజు శతశాతం పంపిణీ చేయాలనే కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశాలతో జిల్లాలోని 15 మండలాలతో పాటు పార్వతీపురం, సాలూరు, కురు పాం, పాలకొండ నియోజకవర్గాల్లో సచివాలయ ఉద్యోగులతో పాటు ఏఎన్ఎం, పంచాయతీ కార్యదర్శి, మహిళా పోలీసులు పాల్గొని పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. పెంచిన పింఛన్ రూ. 4 వేలతో పాటు ఏప్రిల్, మే, జూన్ నెలల్లో బకాయిగా ఉన్న రూ. 3 వేలు కలిపి ఒక్కొక్కరికీ రూ. 7 వేల చొప్పున అందజేశారు. జిల్లాలో దివ్యాంగులకు కూడా పెంచిన మొత్తం అందించారు. దీంతో లబ్ధిదారులు ఎంతో సంతోషించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సీఎం చంద్రబాబు నాయుడు పెంచిన పింఛన్ అందించడంపై జిల్లావాసులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో 1,44,518 మంది లబ్ధిదారులకు గాను 1,38,255 మందికి రూ.92.53 కోట్లు అందించారు. కాగా సాయంత్రానికి 96 శాతం మేర పింఛన్ పంపిణీ జరిగింది.

జిల్లాలో ఇలా..

సాలూరు పట్టణంతో పాటు సాలూరు, మక్కువ మండలాల్లో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పర్యటించి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. పార్వతీపురం పట్టణంతో పాటు పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట మండలాల్లో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర , కలెక్టర్ నిశాంత్ కుమార్ పింఛన్లు అందిం చారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, పాలకొండ, వీరఘట్టం తదితర చోట్ల ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పింఛన్‌దారులకు పింఛన్లు అందజేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, ఇతర శాఖల సిబ్బంది, కూటమి శ్రేణులు పాల్గొన్నారు. కొన్నిచోట్ల వారు దివంగత నేత టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహాలకు, మరికొన్నిచోట్ల సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. మొత్తంగా అంతటా సందడి వాతావరణం నెలకొంది.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: కలెక్టర్

గరుగుబిల్లి : ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా వ్యవహరించకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ నిశాంత్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం ఉదయం సంతోషపురం, ఖడ్గవలసలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీతో పాటు ముఖ్యమంత్రి సందేశ పత్రాన్ని అందిస్తున్నదీ లేనిదీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది శత శాతం పూర్తి చేయాలన్నారు. పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం సంతోషపురం పంచాయతీ పరిధిలోని ప్రధాన వీధులను పరిశీలించారు. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, పారిశుధ్య నిర్వహణ పనులను పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎక్కడైనా పారిశుధ్యం లోపిస్తే.. సంబంధిత పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



సాలూరులో ఓ అవ్వలో ఆనందం చూస్తున్న మంత్రి సంధ్యారాణి



పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఆర్థికంగా చేయూత



దివ్యాంగులకు ఒక్కసారిగా రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పింఛన్ పెంచడం వల్ల ఆర్థికంగా మా లాంటి వారికి చేయూత అందించినట్లే. ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు పింఛను అందించడం ఆనందంగా ఉంది. పోలియో కారణంగా నా కుమారుడు నానిబాబు నడవలేడు. మతిస్థిమితం కూడా లేదు. ఎంతోకష్టపడి డిగ్రీ వరకు చదివించాను. ప్రస్తుతం పెంచిన పింఛన్ సొమ్ము మా లాంటి తల్లిదండ్రులకు ఎంతో ఆసరాగా ఉంటుంది. సీఎం చంద్రబాబు మేలు మరువలేం.

\- చింతాడ చిన్నమ్మి, భామిని



పాలకొండలో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తదితరులు



కురుపాం: మంతినివలసలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జగదీశ్వరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్రదేవ్



పార్వతీపురంలో పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

మాట నిలబెట్టుకున్నారు..



సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట నెలబెట్టుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచారు. అంతేగాకుండా మూడు నెలల బకాయిలతో కలిసి రూ.7వేలు ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉంది.

\- కోట సుభద్ర, లక్ష్మీనారాయణపురం, పార్వతీపురం మండలం

చంద్రబాబు చల్లగా ఉండాలి



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చల్లగా ఉండాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం.. పింఛన్‌ను రూ.4వేలకు పెంచారు. గత బకాయిలతో కలిపి ఒకేసారి రూ.7వేలు అందించారు.

\- నల్ల గంగమ్మ,బంగారమ్మపేట, సాలూరు

రుణపడి ఉన్నాం..



ఈ నెల పింఛను ఒక్కసారిగా రూ.7 వేలు తీసుకోవడం ఆనం దంగా ఉంది. టీడీపీ ప్రభుత్వం రూ.4 వేలకు పింఛన్ పెంచడమే కాకుండా మూడు నెలల బకాయిలతో కలిపి రూ.7వేలు ఇవ్వడం మామూలు విషయం కాదు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు రుణపడి ఉన్నాం.

-గుడ్ల ఠాగూర్, గుమ్మలక్ష్మీపురం

ఇబ్బందులు తప్పుతాయి..



ప్రతి నెలా రూ.4 వేలు పింఛను అందించడం వల్ల కొంత ఆర్థిక ఇబ్బందులు తప్పుతాయి. మందులు కొనుగోలుకు , కుటుంబ పోషణకు ఆ సొమ్ము ఎంతో ఆసరాగా ఉంటుంది. సీఎం చంద్రబాబు అందించిన పింఛన్ సొమ్ము మాలాంటి పేదవారికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

\- రేవల్ల సాంబమూర్తి, సీతంపేట

ఐదేళ్లూ.. నత్తనడకనే..

- 20 శాతానికి మించని సాగునీటి ప్రాజెక్టుల ఆధునికీకరణ పనులు
- పూర్తయిన గడువు
- గతంలో రూ.153.83 కోట్ల జైకా నిధులు మంజూరు
- చేసిన పనులకూ బిల్లులు చెల్లించని గత వైసీపీ సర్కారు
- చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు
- నూతన ప్రభుత్వంపైనే రైతుల ఆశలు

(జియ్యమ్మవలస)

జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి దయనీయంగా మారింది. వాటి ఆధునికీకరణకు జైకా నిధులు మంజూరైనా .. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పనులు సాగలేదు. కనీసం 20 శాతం పనులు కూడా పూర్తికాలేదు. ఇప్పటివరకు చేసిన నిర్మాణాలకు సైతం సకాలంలో బిల్లులు చెల్లించలేదు. దీంతో కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ఆసక్తి చూపించడం లేదు. గత ఐదేళ్లు పనులు నత్తనడకన సాగగా.. మరోవైపు ప్రాజెక్టుల ఆధునికీకరణకు సంబంధించి గడువు పూర్తయిపోయింది. దీంతో తమ పంట పొలాలకు పూర్తిస్థాయిలో సాగునీరందుతుందని ఎదురు చూసిన రైతులకు నిరాశే ఎదురైంది. నూతన ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో వట్టిగెడ్డ, పెద్దగెడ్డ, పెదంకలాం, వెంగళరాయసాగర్ ప్రాజెక్టుల ఆధునికీకరణకు 2016-17లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో నీటి పారుదలశాఖ చీఫ్ ఇంజనీర్ పలుమార్లు పరిశీలన చేశారు. 2018లో జపాన్ ఇంజనీర్ల బృందం ఈ ప్రాజెక్టులను పూర్తి అధ్యయనం చేసింది. ఆ తరువాత ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకొని వారు వెళ్లిపోయారు. 2019 ఫిబ్రవరిలో జపాన్ ఇంటర్నేషనల్ కోపరేషన్ ఏజెన్సీ (జైకా) .. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల ఆధునికీకరణకు ముందుకొచ్చింది. ఈ మేరకు అప్పటి ప్రభుత్వం ఇచ్చిన నివేదిక ప్రాప్తికి రూ. 153.83 కోట్లు మంజూరు చేసింది. కాగా ఈ ఆధునికీకరణ పనులను జైకాతో పాటు ఏపీ ఇరిగేషన్ అండ్ లైవ్లీ హుడ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (అపిలిప్)-2లు సంయుక్తంగా చేయాల్సి ఉంది. పర్యవేక్షణ మాత్రం అపిలిప్-2దే. అయితే 2019 తర్వాత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పనులేవీ పూర్తికాలేదు. జైకా నిధులున్నా.. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం వల్లే ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

ప్రాజెక్టుల వారీగా చూస్తే..

- **వట్టిగెడ్డ:** కురుపాం నియోజకవర్గ పరిధి జియ్యమ్మవలస మండలం తాళ్లడుమ్మ పంచాయతీ రావాడ గ్రామం పక్కన ఈ ప్రాజెక్టు ఉంది. దీని కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా 16,680 ఎకరాలకు సాగునీరందే విధంగా డిజైన్ చేశారు. వట్టిగెడ్డ ఆధునికీకరణకు 2019, జనవరి 8న రూ. 44.85 కోట్లతో పరిపాలనా ఆమోదం పొందితే, 2020 ఆగస్టు 19న సాంకేతిక అనుమతి లభించింది. శ్రీసాయి కనస్ట్రక్షన్, విజయవాడ వారు 2021, జనవరి 8న నీటి పారుదలశాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. 2023, జనవరి 7 నాటికి ఆధునికీకరణ పనులు పూర్తి చేస్తామన్నారు. అయితే వివిధ కారణాలతో 2024, జూలై 7 నాటికి పూర్తి చేసేందుకు కాంట్రాక్టరు అంగీకరించారు. కానీ ఇంతవరకు 15 శాతం పనులే పూర్తయ్యాయి. ఇప్పటివరకు పూర్తయిన నిర్మాణాలకు బిల్లులు అందకపోవడంతో కాంట్రాక్టరు చేతులెత్తేశారు.
- **పెద్దగెడ్డ:** ఈ ప్రాజెక్టు సాలూరు నియోజకవర్గం పాచిపెంట మండలంలో ఉంది. దీని ద్వారా పాచిపెంట మండలంలో 6,039 ఎకరాలకు, సాలూరు మండలంలో 2,839 ఎకరాలు, విజయనగరం జిల్లా రామభద్రపురం మండలంలో 3,122 ఎకరాలకు సాగునీరందించాల్సి ఉంది. ఈ ప్రాజెక్టు ఆధునికీకరణ బాధ్యతను తార్నాక (హైదరాబాద్)కు చెందిన ఎం/ఎస్ జీవీవీ - వైఎంఎంఆర్ (జేవీ) తీసుకుంది. రూ. 23.83 కోట్లతో ఆధునికీకరణ చేసేందుకు గాను 2020, జూలై 5న నీటి పారుదలశాఖ ఉన్నతాధికారులతో ఒప్పందం కుదుర్చుకుంది. వాస్తవానికి 18 నెలల్లో ఈ పనులు పూర్తి చేయాల్సి ఉంది. 2020, డిసెంబరు 31 నాటికి పనులు పూర్తవ్వాలి. కానీ ఇంతవరకు 20 శాతం పనులు జరగ్గా.. దానికి సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయి.




వట్టిగెడ్డ ప్రాజెక్టు

- **పెదంకలాం:** పార్వతీపురం నియోజకవర్గం సీతానగరం మండలం పెదంకలాం వద్ద ఈ ప్రాజెక్టు ఉంది. దీని ద్వారా బలిజిపేట మండలంలో 6,617.16 ఎకరాలకు, విజయనగరం జిల్లా వంగర మండలంలో 1,636.31 ఎకరాలకు అంటే 8,253.47 ఎకరాలకు సాగునీరందించాల్సి ఉంది. దీని ఆధునికీకరణకు 2019, ఫిబ్రవరి 15న రూ. 17.30 కోట్లతో పరిపాలన ఆమోదం లభించింది. 2020, జూన్ 22న సాంకేతిక ఆమోదం వచ్చింది. దీని ఆధునికీకరణ పనులకు తెలంగాణ రాష్ట్రంలోని సూర్యాపేటకు చెందిన ఎం/ఎస్ ఎస్‌కేఆర్ కనస్ట్రక్షన్, ఎం/ఎస్ ఆజ్‌దప్మ ఇన్ కార్పొరేషన్ సంయుక్తంగా ముందుకు వచ్చాయి. వారు నీటి పారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. 2023, డిసెంబరు 31 లోగా పనులు చేయాల్సి ఉంది. అయితే కేవలం 5 శాతం పనులు జరిగినా బిల్లుల చెల్లింపులు జరగలేదు.
- **వెంగళరాయసాగర్:** సాలూరు నియోజకవర్గంలో సువర్ణముఖి నదిపై ఈ ప్రాజెక్టు ఉంది. దీని ద్వారా మక్కువ మండలంలో 14,550 ఎకరాలకు, సీతానగరం మండలంలో 3,723 ఎకరాలు, విజయనగరం జిల్లా బొబ్బిలి మండలంలో 6,427 ఎకరాలకు కలిపి మొత్తం 24,700 ఎకరాలకు సాగునీరందించేలా డిజైన్ చేశారు. ఈ ప్రాజెక్టు ఆధునికీకరణకు 2019, ఫిబ్రవరి 15న రూ. 63.50 కోట్లతో పరిపాలన ఆమోదం పొందారు. 2020, జూలై 11న సాంకేతిక ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టుకు కూడా పెదంకలాం కాంట్రాక్టర్లే నీటి పారుదలశాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్‌తో 2020, ఫిబ్రవరి 26న రూ. 48.90 కోట్లతో ఒప్పందం కుదుర్చుకున్నారు. అగ్రిమెంట్ ప్రకారం 2023, ఏప్రిల్ 25 నాటికి పూర్తి చేయాల్సి ఉంది. కానీ కేవలం 21 శాతం పనులే పూర్తయ్యాయి. తరువాత దీనిని పూర్తి చేసేందుకు 2025, మార్చి 24 వరకు గడువు పెంచారు.

నిధులున్నా.. బిల్లులు చెల్లించలే..

జిల్లాలో నాలుగు ప్రాజెక్టుల ఆధునికీకరణకు సంబంధించి సుమారు రూ.153.83 కోట్ల మేర జైకా నిధులు మంజూరయ్యాయి. అయితే గత వైసీపీ ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించలేదు. ఇప్పటివరకు చేసిన పనులకు గాను సుమారు రూ. 16 కోట్ల వరకు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉంది. దీనిపై ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు, అధికారులు పూర్తిగా దృష్టి సారించాల్సి ఉంది. పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పెద్దగెడ్డ ప్రాజెక్టు

బకాయిలు చెల్లించాల్సి ఉంది..

సాగునీటి ప్రాజెక్టుల ఆధునికీకరణ పనుల విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఇటీవల కలెక్టరేట్‌లో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి దీనిపై రివ్యూ చేశారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పూర్తిగా వివరించాం. బకాయి ఉన్న రూ.16 కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లిస్తే పనులు చేసే అవకాశం ఉంది.

\- వైవీ రాజరాజేశ్వరి, నీటి పారుదలశాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్, పార్వతీపురం మన్యం

ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలి

- కలెక్టర్ నిశాంత్ కుమార్

పార్వతీపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రజలు అందించే ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా 121 వినతులు రాగా.. కలెక్టర్ అర్జీదారులతో మాట్లాడి..వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మక్కువ మండలం పెద్దకోట గెడ్డ గ్రామ రెవెన్యూలో సర్వేనెంబర్ 22, పార్టు-5లో రెండు ఎకరాల 50 సెంట్లు ఆక్రమణకు గురైందని ఆ ప్రాంతవాసులు ఫిర్యాదు చేశారు. చేయూత నగదు బ్యాంక్ ఖాతాల్లో జమకాలేదని పాలకొండకు చెందిన మహిళలు వినతి పత్రం అందించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమావేశమయ్యారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, తాగునీటి సరఫరాలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు. ఎక్కడైనా పైపుల లీకేజీ ఉంటే వెంటనే వాటిని మార్చాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో రోజూ పిల్లలు చేతులు శుభ్రపరుచుకునేలా చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీవో విష్ణు చరణ్, జేసీ శోభిక, ఇన్‌చార్జి డీఆర్వో కేశవనాయుడు తదితరులు ఉన్నారు.

రహదారిపైకి ఏనుగులు

గరుగుబిల్లి, జూలై 1 : గరుగుబిల్లి మండలం గిజబ ప్రధాన రహదారిపై సోమవారం ఏనుగులు సంచరించాయి. దీంతో గ్రామస్థులతో పాటు వాహనదారులు భయాందోళన చెందారు. దాదాపు అరగంట పాటు ఆరు ఏనుగులు ఆ ప్రాంతంలో హల్‌చల్ చేశాయి. దీంతో అంతర్రాష్ట్ర రహదారికి ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. గజరాజులు ఎవరిపై దాడి చేస్తాయోనని వాహనదారులు, ప్రయాణికులు హడలెత్తిపోయారు. సమాచారం తెలుసుకున్న అటవీశాఖ సిబ్బంది రహదారిపై నుంచి దిగువ ప్రాంతాలకు ఏనుగులను తరలించారు. దీంతో అక్కడి వారు ఊపిరిపీల్చుకున్నారు. ఆ తర్వాత యథావిధిగా వాహనాల రాకపోకలు కొనసాగాయి.



గిజబ రహదారిపై సంచరిస్తున్న ఏనుగులు

ఐఐఎఫ్‌టీలో సర్టిఫికెట్ కోర్సు

ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)-'సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఇన్ ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ మేనేజ్‌మెంట్'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీని వ్యవధి నాలుగు నెలలు. ఈ ప్రోగ్రామ్‌ను ఆఫ్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా క్లాస్ రూమ్ తరగతులు, ఆన్‌లైన్ అసెస్‌మెంట్, అసైన్‌మెంట్, ప్రజంటేషన్, ప్రాజెక్ట్ వర్క్‌లు, కేస్ స్టడీస్, క్విజ్ ప్రోగ్రామ్‌లు, ఇంటర్నల్&ఫైనల్ ఎగ్జామినేషన్స్ ఉంటాయి. లెర్నింగ్ వెబ్ పోర్టల్‌కు లైఫ్ టైమ్ యాక్సెస్, కోర్సు మెటీరియల్ ఇస్తారు. ఇండస్ట్రీ లీడర్స్, మిడిల్ లెవెల్ ఎగ్జిక్యూటివ్‌లు, ఆంత్రప్రెన్యూర్స్, ఫ్రెషర్స్‌కు ఈ ప్రోగ్రామ్ ఉపయోగకరంగా ఉంటుంది.

కోర్సు వివరాలు

● వారాంతాల్లో ఉదయం తొమ్మిదిన్నర నుంచి సాయంత్రం అయిదు వరకు క్యాంపస్‌లో తరగతులు నిర్వహిస్తారు. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి.

● ఇంటర్నేషనల్ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్ 20 గంటలు, ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆపరేషన్స్ అండ్ ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ డాక్యుమెంటేషన్ 30 గంటలు, ఇండియాస్ ఫారిన్ ట్రేడ్ పాలసీ 20 గంటలు, ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫైనాన్స్ 30 గంటలు, కస్టమ్ రెగ్యులేషన్స్ అండ్ ఇంపోర్ట్ ప్రొసీజర్స్ ఆఫ్ ఇండియా 20 గంటలు, ఇంటర్నేషనల్ ట్రేడ్ లాజిస్టిక్స్ 30 గంటలు తరగతులు నిర్వహిస్తారు. ఇంటర్నల్, ఫైనల్ ఎగ్జామ్స్‌ను ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. కనీసం 50 శాతం మార్కులు వస్తేనే సర్టిఫికెట్ ఇస్తారు.

అర్హత

● గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 20
- **వెబ్‌సైట్:** iift.ac.in



జేఎన్‌టీయూఏలో ఇంటర్నేషనల్ కొలాబరేటివ్ ప్రోగ్రామ్

అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూఏ), స్వీడన్‌లోని బ్లీకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీటీహెచ్) ఉమ్మడిగా నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ కొలాబరేటివ్ ప్రోగ్రామ్ (బీటెక్&బీఎస్+ఎంఎస్)లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. ప్రోగ్రామ్ వ్యవధి ఆరేళ్లు. మొదటి మూడేళ్లు జేఎన్‌టీయూఏ-కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో, చివరి మూడేళ్లు బీటీహెచ్‌లో చదవాల్సి ఉంటుంది. నాలుగో ఏడాది అంటే బీటీహెచ్‌లో ఒక సంవత్సరం చదివిన తరవాత ప్రోగ్రామ్‌నుంచి వైదొలగే వీలుంది. వీరికి జేఎన్‌టీయూఏ నుంచి బీటెక్ డిగ్రీ, బీటీహెచ్ నుంచి బీఎస్ డిగ్రీ లభిస్తాయి. మిగిలిన రెండేళ్ల ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి బీటీహెచ్ నుంచి ఎంఎస్ డిగ్రీ లభిస్తుంది. సీఎస్‌ఈ విభాగంలో 20 సీట్లు, ఈసీఈ విభాగంలో 10 సీట్లు ఉన్నాయి. జేఈఈ మెయిన్ 2024 ర్యాంక్ ద్వారా 50 శాతం సీట్లను; ఏపీ ఈఏపీసెట్ 2024/టీజీ ఈఏపీసెట్ 2024 స్కోర్ ద్వారా మిగిలిన 50 శాతం సీట్లను భర్తీ చేస్తారు. ఈ ప్రోగ్రామ్‌నకు సంబంధించిన అవేర్‌నెస్ సెషన్‌ను జూలై 20న సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహిస్తారు. స్వీడన్‌లో ఎంఎస్ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు అక్కడే మరో ఏడాది రెసిడెన్స్ పర్మిట్ పొందవచ్చు. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఉన్నాయి.

ప్రోగ్రామ్ స్పెషలైజేషన్‌లు

● జేఎన్‌టీయూఏ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో మొదటి మూడేళ్లు బీటెక్(కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్), బీటీహెచ్‌లో నాలుగో ఏడాది బీఎస్(కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్) చదవాల్సి ఉంటుంది.

● బీటీహెచ్‌లో చివరి రెండేళ్ల ఎంఎస్ ప్రోగ్రామ్‌లో సీఎస్‌ఈ అభ్యర్థులకు కంప్యూటర్ సైన్స్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ స్పెషలైజేషన్‌లు; ఈసీఈ అభ్యర్థులకు మెషిన్ లెర్నింగ్-సెన్సర్స్ అండ్ సిస్టమ్స్ స్పెషలైజేషన్ ఉంటాయి.

అర్హత

● బీఐఈ(ఏపీ)/సీబీఎస్‌ఈ/ఐసీఎస్‌ఈ నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 70 శాతం మార్కులు తప్పనిసరి. జేఈఈ మెయిన్ 2024/ఏపీ ఈఏపీసెట్ 2024/టీజీ ఈఏపీసెట్ 2024 స్కోర్ ఉండాలి. ఆంగ్ల మాధ్యమంలో చదవని అభ్యర్థులకు ఐఈఎల్‌టీఎస్/టోఫెల్ స్కోర్ ఉండాలి. ఐఈఎల్‌టీఎస్‌లో ప్రతి సెక్షన్‌లో కనీసం 5.5, మొత్తమ్మీద కనీసం 6.5 స్కోర్; టోఫెల్‌లో అయితే 575/90 స్కోర్ ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 25
- పూర్తిచేసిన దరఖాస్తును కింది ఈ-మెయిల్‌కు అప్‌లోడ్ చేయాలి.
- **అడ్మిషన్ కౌన్సెలింగ్:** జూలై 29న
- **కౌన్సెలింగ్ వేదిక:** డైరెక్టర్ ఆఫ్ ఫారిన్ అఫైర్స్ అండ్ అలూమ్నీ మ్యాటర్స్ కార్యాలయం, జేఎన్‌టీయూఏ, అనంతపురం.
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** రిజిస్ట్రార్, జేఎన్‌టీయూఏ, అనంతపురం, ఆంధ్రప్రదేశ్-515002
- **ఈ-మెయిల్:** indiarelations@bth.se, dfaam@jntua.ac.in
- **వెబ్‌సైట్:** www.jntua.ac.in

దిక్సూచి DIKSUCHI

ఐఐటీ మద్రాస్‌లో ఎంబీఏ- డిజిటల్ మారిటైమ్ అండ్ సప్లయ్ చైన్

మద్రాస్‌లోని ద ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) ప్రపంచంలోనే తొలిసారిగా వినూత్నమైన కోర్సు 'డిజిటల్ మారిటైమ్ అండ్ సప్లయ్ చైన్'ని అందుబాటులోకి తెచ్చింది. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న సముద్ర వాణిజ్యం, సరఫరా వ్యవస్థ యాజమాన్య పద్ధతుల్లో ఎదురయ్యే సంక్లిష్టతలను అధిగమించేందుకు అవసరమైన ఆధునిక నైపుణ్యాలను ఈ కోర్సు ద్వారా పెంపొందించుకోవచ్చు. రెండేళ్ల వ్యవధి గల ఈ కోర్సును ఐఐటీ మద్రాస్‌కి చెందిన డిపార్ట్‌మెంట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, ఓషన్ ఇంజనీరింగ్ రూపొందించాయి. తొలి బ్యాచ్ 2024 సెప్టెంబరులో ప్రారంభం కాబోతుంది.

● **ఎంబీఏ ఇన్ డిజిటల్ మారిటైమ్ అండ్ సప్లయ్ చైన్**

వ్యవధి: రెండేళ్లు.

ప్రోగ్రామ్ వివరాలు: ఐఓటీ, ఏఐ, ఎంఎల్, బ్లాక్ చెయిన్ వంటి డిజిటల్ టెక్నాలజీపై నైపుణ్యాలు సాధిస్తారు. 900 గంటలు క్లాస్ రూమ్ సెషన్స్, ప్రాజెక్ట్ వర్క్ ఉంటాయి. కోర్సుకి మొత్తం 192 క్రెడిట్స్ నిర్దేశించారు. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కి ఆన్‌లైన్, ఆన్ క్యాంపస్ మాడ్యుల్స్ అందుబాటులో ఉన్నాయి. గ్రాడ్యుయేషన్ పూర్తి అయిన తరవాత ఐఐటీ మద్రాస్ ఆలూమ్నీ స్టేటస్ కూడా లభిస్తుంది. అదేవిధంగా ఐఐటీ మద్రాస్ ఇన్‌క్యుబేషన్ అండ్ స్టార్టప్ ప్లాట్‌ఫాం ద్వారా ఉద్యోగవకాశాలు పొందే సౌలభ్యం కూడా ఉంది.

అర్హత: అభ్యర్థులు కనీసం 60 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. రెండేళ్ల పూర్తి స్థాయి(ఫుల్ టైం) పని అనుభవం ఉండాలి.

ఎంపిక విధానం: వచ్చిన దరఖాస్తులను పరిశీలించి షార్ట్‌లిస్ట్ చేస్తారు. షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఆన్‌లైన్ అడ్మిషన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

కోర్సు ఫీజు: రూ.9,00,000. వాయిదాల పద్ధతిలో చెల్లించవచ్చు. అర్హులైన వారికి బ్యాంక్ రుణ సదుపాయం కూడా ఉంటుంది.

వెబ్‌సైట్: https://www.iitm.ac.in/



జాబ్ కార్నర్: హిందుస్థాన్ కాపర్‌లో జూనియర్ మేనేజర్లు

కోల్‌కతాలోని హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్..వివిధ విభాగాల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: జూనియర్ మేనేజర్

ఖాళీలు: 56

విభాగాలు: మైనింగ్, ఎలక్ట్రికల్, కంపెనీ సెక్రటరీ, ఫైనాన్స్, హెచ్‌ఆర్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బ్యాచిలర్ డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

గరిష్ఠ వయోపరిమితి: 2024 జూన్ 1 నాటికి 40 సంవత్సరాలు మించకూడదు

పే స్కేల్: నెలకు రూ.30,000- రూ.1,20,000

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా.

దరఖాస్తు ఫీజు: రూ.500

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 21

వెబ్‌సైట్: https://www.hindustancopper.com/

ఎన్‌ఎఫ్‌ఎస్‌సీలో బీటెక్(ఫైర్ ఇంజనీరింగ్)


నాగ్‌పూర్‌లోని నేషనల్ ఫైర్ సర్వీస్ కాలేజ్(ఎన్ ఎఫ్‌ఎస్‌సీ)- బీటెక్(ఫైర్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. మొత్తం 60 సీట్లు ఉన్నాయి. జేఈఈ మెయిన్ 2024 ర్యాంక్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ/బయోటెక్నాలజీ/బయాలజీ/టెక్నికల్ ఒకేషనల్ సబ్జెక్ట్‌లతో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. జేఈఈ మెయిన్ 2024లో అర్హత స్కోర్ ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 2
- **దరఖాస్తుల పరిశీలన:** జూలై 4న
- **అభ్యర్థులకు కాల్ లెటర్స్ పంపిణీ:** జూలై 5న
- **అడ్మిషన్స్ తేదీ:** జూలై 29
- **వెబ్‌సైట్:** https://nfscbtechadmissions. com/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/YFfr14Xలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి



మాస్ మూమెంట్స్‌తో 'స్టెప్పామార్'

రామ్ పోతినేని ప్రస్తుతం పూరి జగన్నాథ్ దర్శకత్వంలో పాన్ ఇండియా సినిమాగా తెరకెక్కుతోన్న 'డబుల్ ఇస్మార్ట్'లో నటిస్తున్నారు. ఇది 2019లో విడుదలై బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌ను అందుకున్న 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్. ఈ సినిమాలో హీరోయిన్‌గా కావ్య థాపర్ నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్, అలీ, గెటప్ శ్రీను కీలక పాత్రలు పోషిస్తున్నారు. పూరి కనెక్ట్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, చార్మి కౌర్ సినిమాను నిర్మిస్తున్నారు. సినిమా ఆగస్టు 15న విడుదలవుతోంది. ఇటీవలే విడుదలైన ఈ సినిమా టీజర్ అందరికీ మంచి కిక్ ఇచ్చి.. సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. సోమవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌ను 'మాస్ సాంగ్ ఆఫ్ ది ఇయర్' అంటూ మేకర్స్ విడుదల చేశారు. 'స్టెప్పామార్' అంటూ సాగే ఈ పాట హై ఎనర్జిటిక్ మాస్ మూమెంట్స్‌తో సాగింది. ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించగా, అనురాగ్ కులకర్ణి, సాహితీ ఆలపించారు. జానీ మాస్టర్ కొరియోగ్రఫీ అందించిన ఈ సాంగ్‌కు మణిశర్మ సంగీతం అందించారు.

సూపర్ నేచురల్ థ్రిల్లర్



వైవిధ్యమైన చిత్రాలతో అందరినీ ఆకట్టుకొంటున్న సుధీర్‌బాబు ఓ సూపర్ నేచురల్ మిస్టరీ థ్రిల్లర్‌లో నటించనున్నారు. మన పురాణాలతో అనుసంధానం చేస్తూ ఎన్నో రహస్యాలను వెలికి తీసే కథతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. ఇంతకుముందెన్నడూ రాని డిఫరెంట్ కాన్సెప్ట్‌తో విజువల్ ఎఫెక్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యం ఇస్తూ రూపుదిద్దుకొనే ఈ చిత్రానికి వెంట్ కల్యాణ్ దర్శకుడు. 'రుస్తుమ్', 'టాయ్‌లెట్', 'ఏక్ ప్రేమ్ కథ', 'ప్యాడ్‌మ్యాన్', 'పరి' వంటి విజయవంతమైన చిత్రాలను అందించిన ప్రేరణ అరోరా సమర్పణలో ఈ సినిమా రూపుదిద్దుకుంటుంది. ఇందులో సుధీర్ బాబు సరసన బాలీవుడ్ కథానాయిక నటిస్తుంది. ఆమె ఎవరనేది త్వరలో తెలియజేస్తామని దర్శకనిర్మాతలు చెప్పారు. 'కుట్ర, పన్నాగాలతో మంచికి, చెడుకీ మధ్య జరిగే యుద్ధం ఈ చిత్ర ముఖ్యాంశం. పాన్ ఇండియా సినిమాల్లో ఓ మైల్ స్టోన్‌గా ఉంటుంది' అని చెప్పారు దర్శకుడు కల్యాణ్. ఈ సినిమా గురించి సుధీర్‌బాబు మాట్లాడుతూ 'ఈ స్క్రిప్ట్ నచ్చి ఏడాది నుంచి ఈ టీమ్‌తో ట్రావెల్ అవుతున్నాను. డిఫరెంట్ కంటెంట్‌తో రూపొందనున్న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు ఎప్పుడు వస్తుందా అని ఆతృతతో ఎదురుచూస్తున్నాను' అని చెప్పారు. ఆగస్టు 15న ఫస్ట్‌లుక్ విడుదల చేస్తామనీ, సినిమాను శివరాత్రి సందర్భంగా వచ్చే ఏడాది మార్చిలో విడుదల చేస్తామనీ ప్రేరణ అరోరా చెప్పారు.

మిస్ యూనివర్స్‌తో 'క్యాలెండర్' సాంగ్



కమల్ హాసన్ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'భారతీయుడు 2'. ఇది 1996లో రిలీజై బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించిన 'భారతీయుడు' చిత్రానికి సీక్వెల్. టాప్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వం వహిస్తుండగా, సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో కాజల్ అగర్వాల్, రకుల్‌ప్రీత్ సింగ్, సిద్ధార్థ్, ఎస్.జె.సూర్య, బాబీ సింహా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ పాన్ ఇండియన్ మూవీ 12న విడుదలవుతోంది. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్, ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచేశాయి. సోమవారం ఈ సినిమా నుంచి 'క్యాలెండర్' లిరికల్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో దక్షిణాఫ్రికాకు చెందిన మోడల్, 2017 మిస్ యూనివర్స్ డెమి లీ టెబో నటించి.. పాటకే ప్రత్యేకార్షణగా నిలిచారు. ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించగా, శ్రావణ భార్గవి ఆలపించారు. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందించారు.

'కోడి బుర్ర' కథ ఏమిటి?



తమిళ హీరో శ్రీరామ్ కొత్త చిత్రం 'కోడి బుర్ర' షూటింగ్ సోమవారం ఉదయం హైదరాబాద్‌లో మొదలైంది. శ్రుతి మీనన్, ఆరుషి హీరోయిన్లుగా నటిస్తున్నారు. శాసనసభ్యుడు మల్‌రెడ్డి రంగారెడ్డి కెమెరా స్విచ్ ఆన్ చేసిన అనంతరం నిర్మాత బెక్కం వేణుగోపాల్ తొలి క్లాప్ ఇచ్చి షూటింగ్ ప్రారంభించారు. అనంతరం దర్శకుడు చంద్రశేఖర్ కానూరి మాట్లాడుతూ 'ఈ సినిమాలో శ్రీరామ్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. హీరోయిన్ శ్రుతి మీనన్ డాక్టర్‌గా నటిస్తోంది. క్రైమ్ థ్రిల్లర్ కథాంశంతో చిత్రం రూపుదిద్దుకుంటుంది' అని చెప్పారు. ఒక ఇంట్రెస్టింగ్ మూవీలో నటిస్తున్నందుకు ఆనందంగా ఉందని శ్రీరామ్ చెప్పారు.

యానిమేషన్ చిత్రానికి డాలర్ల పంట



యానిమేషన్ చిత్రం 'ఇన్‌సైడ్ అవుట్ 2' ప్రపంచవ్యాప్తంగా దుమ్ముదులుపుతోంది. చరిత్రలో ఇప్పటివరకూ ఏ యానిమేషన్ చిత్రం సాధించని అరుదైన ఫీట్‌ను నమోదు చేసింది. కేవలం మూడు వారాల్లోనే గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద వన్ బిలియన్ డాలర్లు (దాదాపు రూ.8500 కోట్లు) ఆర్జించింది. ఇటువంటి సంచలన రికార్డు సాధించడమే కాకుండా ఈ ఏడాది ఇప్పటివరకూ రిలీజైన అన్ని సినిమాల కలెక్షన్లను వెనక్కునెట్టి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. మొత్తానికి వన్ బిలియన్ డాలర్లు కొల్లగొట్టిన 11వ యానిమేషన్ సినిమాగా 'ఇన్‌సైడ్ అవుట్ 2' చరిత్ర సృష్టించింది. ఇండియాలోనూ రిలీజైన ఈ చిత్రం ఇప్పటికే రూ.100 కోట్ల పైచిలుకు కలెక్షన్లను సాధించడం విశేషం. 2015లో ఈ సినిమా మొదటి భాగం 'ఇన్‌సైడ్ అవుట్' జూన్ 19న విడుదలైంది. ఈ చిత్రానికి పీట్ డాక్టర్ దర్శకత్వం వహించారు. 11 ఏళ్ల రిలే అండర్సన్ అనే బాలిక మెదడులోని భావోద్వేగాలైన ఆనందం, కోపం, చిరాకు, బాధ, భయం యానిమేషన్ రూపు సంపాదించుకుని.. ఆమె ఆలోచనల్ని, నిర్ణయాల్ని ఎలా ప్రభావితం చేస్తాయి అనేది ఈ సినిమా కథ. ఈ సినిమా లైఫ్‌టైమ్ కలెక్షన్స్ దాదాపు 900 మిలియన్ డాలర్లు (రూ.7500 కోట్లు). ఈ సినిమాకు సీక్వెల్‌గా తెరకెక్కింది 'ఇన్‌సైడ్ అవుట్ 2'. జూన్ 14న విడుదలైన ఈ సీక్వెల్‌కు కెల్సీ మన్ దర్శకత్వం వహించారు. దాదాపు 96 నిమిషాల నిడివి కలిగిన ఈ సినిమాను ప్రముఖ హాలీవుడ్ నిర్మాణ సంస్థ వాల్ట్ డిస్నీ అనుబంధ సంస్థ పిక్సర్ నిర్మించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. తన తోటి మిత్రులతో ఐస్ హాకీ ఆడే సమయంలో 13 ఏళ్ల రిలే అండర్సన్ జీవితంలోకి ఆందోళన, అసంతృప్తి, సిగ్గు, అసూయ ప్రవేశిస్తాయి. ఆ క్షణం నుంచి సినిమా ఎన్ని మలుపులు తీసుకుందనేది దర్శకుడు చాలా వినోదాత్మకంగా చూపించారు. టీనేజర్లను విపరీతంగా ఆకట్టుకునేలా తెరకెక్కిన ఈ చిత్రానికి ప్రస్తుతం కుటుంబ సమేతంగా ప్రేక్షకులు క్యూ కడుతున్నారు. ఇదే ఊపు కొనసాగితే ఈ సినిమా మరిన్ని రికార్డులు సాధించడం ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

హారర్ మిస్టరీ...



బెల్లంకొండ సాయిశ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ జంటగా ఓ హారర్ మిస్టరీ సినిమాలో నటిస్తున్నారు. 'చావు కబురు చల్లగా' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న కౌశిక్ పెగళ్లపాటి దర్శకత్వం వహిస్తున్నారు. సాహు గారపాటి నిర్మిస్తున్నారు. సోమవారం ఈ సినిమాను ప్రారంభించారు. ఈ సినిమా ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత నవీన్ యెర్నేని క్లాప్ కొట్టగా, నిర్మాత దిల్‌రాజు కెమెరా స్విచ్చాన్ చేశారు. సతీశ్ కిలారు, అన్మోల్ శర్మ స్క్రిప్ట్ అందించారు. జూలై 11 నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని, ఇప్పటివరకూ ఎవ్వరూ తీయని కథాంశంతో సినిమాను తెరకెక్కిస్తున్నట్లు చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రానికి ఎడిటర్: నిరంజన్ దేవరమానే, డీఓపీ: చిన్మయ్ సలార్కర్, సంగీతం: బి.అజనీశ్ లోక్‌నాథ్.



సునయన పెళ్లి అతనితోనేనా?


'కుమారి వర్సెస్ కుమారి' చిత్రంతో వెండితెర ప్రవేశం చేశారు సునయన. 'రాజరాజచోర' చిత్రంతో హిట్ అందుకుని ఆ తర్వాత కొన్ని సినిమాలు, 'మీట్ క్యూట్', 'ఇన్‌స్పెక్టర్ రిషి' వెబ్ సిరీస్‌లో నటించారు. కొన్ని రోజుల క్రితం తనకు నిశ్చితార్థం అయ్యిందని సోషల్ మీడియాలో ప్రకటించి.. తన కాబోయే భర్త వేలు పట్టుకున్న ఫొటోను షేర్ చేశారు. కానీ తను పెళ్లాడబోయే వ్యక్తి పేరు మాత్రం చెప్పకుండా అందరినీ సస్పెన్స్‌లో పెట్టారు. తాజాగా, ఆమె పెళ్లి చేసుకోబోయేది దుబాయ్‌కు చెందిన ఖలీద్ అల్ అమేరి అనే యూట్యూబర్‌ను అని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. దీనికి కారణం జూన్ 26న ఖలీద్ అల్ అమేరి తన ఇన్‌స్టా ఖాతాలో ఓ అమ్మాయితో ఉంగరాలు మార్చుకున్న ఫొటోను పోస్ట్ చేశారు. దీంతో సునయన నిశ్చితార్థం చేసుకున్న వ్యక్తి.. పెళ్లి చేసుకోబోయేది ఖలీల్‌నే అని అందరూ అనుకుంటున్నారు. కాగా, ఖలీల్‌కు ఇప్పటికే సలామా మొహమ్మద్‌తో పెళ్లయిందని, ఫిబ్రవరి 14న వారిద్దరూ విడాకులకు అప్లై చేయగా వెంటనే విడాకులు మంజూరు అయ్యాయట. ఈ విషయాన్ని స్వయంగా ఖలీల్ భార్య సలామానే చెప్పారు.



రామ్‌చరణ్ సొంత చిత్రంలో నిఖిల్

వి మెగా పిక్చర్స్ పతాకంపై చిత్రాలు నిర్మించడానికి హీరో రామ్‌చరణ్ నిర్మాణరంగంలోకి ప్రవేశించారు. యూవీ క్రియేషన్స్ విక్రమ్‌రెడ్డి ప్రొడక్షన్ పార్ట్‌నర్. అభిషేక్ పిక్చర్స్ అధినేత అభిషేక్ అగర్వాల్ వీరిద్దరితో చేతులు కలిపారు. నిఖిల్ హీరోగా నిర్మించే తొలి చిత్రం 'ది ఇండియా హౌస్' నిర్మాణానికి సోమవారం శ్రీకారం చుట్టారు. సాయి మంజ్రేకర్ హీరోయిన్‌గా నటించే ఈ చిత్రంలో అనుపమ్ ఖేర్ కీలక పాత్ర పోషించనున్నారు. 1905వ సంవత్సరం నేపథ్యంగా ప్రేమ, విప్లవం అంశాలతో రూపుదిద్దుకొనే ఈ చిత్రం షూటింగ్ హంపీలోని విరూపాక్ష దేవాలయంలో ప్రారంభమైంది. మంగళవారం నుంచి రెగ్యులర్ షూటింగ్ జరుగుతుంది. ఈ చిత్రానికి కెమరూన్ బ్రైసన్ ఛాయాగ్రాహకుడు.

ఐదుగురు స్నేహితుల వినోదం



ఎమ్మెస్ చదవడానికి విదేశాలకు వెళ్లిన ఐదుగురు చిన్ననాటి స్నేహితుల మధ్య జరిగే సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకుంటున్న చిత్రం 'ది బర్త్‌డే బాయ్'. రవికృష్ణ, సమీర్ మళ్లా, రాజీవ్ కనకాల ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని విస్కీ దర్శకత్వంలో బొమ్మా బొరుసా సంస్థ నిర్మిస్తోంది. ఈ చిత్రం టీజర్‌ను దర్శకుడు మెహర్ రమేశ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు విస్కీ మాట్లాడుతూ 'ఇదొక కామెడీ డ్రామా. చిత్రంలోని ప్రతి పాత్ర ఎంటర్‌టైన్ చేస్తుంది. ఐదుగురు స్నేహితులకు ఎదురైన అనుభవాలు, వాటి పర్యావసానాలు చాలా ఆసక్తికరంగా ఉంటాయి. ఈ నెల 19న సినిమాను విడుదల చేస్తాం' అని చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/U7EeSaE లో చదవండి.

నగర పాలక సంస్థకు 12 వినతులు

విజయనగరం రింగురోడ్డు: నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదికలో 12 వినతులు వచ్చాయి. పలువురు తమ సమస్యలను వివరిస్తూ నగర పాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడికి వినతిపత్రాలు అందజేశారు. వినతుల పరిష్కారానికి సంబంధిత విభాగ అధికారులకు కమిషనర్ ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి ఐదు, ఇంజనీరింగు విభాగానికి సంబంధించి మూడు, శానిటేషన్‌కు సంబంధించి రెండు, రెవెన్యూ విభాగానికి సంబంధించి రెండు వినతులు అందాయి. ఏసీపీ అమ్మాజీరావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ సాంబమూర్తి, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్స్ డే వేడుకలు

విజయనగరం రింగురోడ్డు: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఏపీ ఎస్టీ క్యాంపు కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ముందుగా డాక్టరు బీసీ రాయ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆదివాసీ సంఘ నేతలు చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

రామలక్ష్మణమూర్తి ఆశయ సాధనకు కృషి

విజయనగరం రింగురోడ్డు: గ్రంథాలయోద్యమ నేత జయంతి రామలక్ష్మణమూర్తి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. సోమవారం రామలక్ష్మణమూర్తి జయంతిని జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి కె.దయానంద్, వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్ ఆధ్వర్యంలో గురజాడ స్మారక కేంద్ర గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వ్యాస రచన పోటీల విజేతలకు ఎమ్మెల్సీ రఘువర్మ ప్రశంసా పత్రాలు అందజేశారు. సంఘ అధ్యక్షుడు నాలుగెస్సల రాజు, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వెంకటరావు, ఆర్.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

విజయనగరం రింగురోడ్డు: స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఎస్‌బీఐ ఆధ్వర్యంలో సోమవారం రోటరీ బ్లడ్ బ్యాంకులో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌బీఐ ఏజీఎం సురేష్ మాట్లాడుతూ రక్తదానం సామాజిక బాధ్యతన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో సుమారు 50 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.
రామభద్రపురం: భారతీయ స్టేట్ బ్యాంకు వ్యవస్థాపక దినోత్సవాన్ని మండల కేంద్రంలో ఉన్న బ్రాంచిలో మేనేజర్ బెలగాం హరీంద్ర ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఖాతాదారుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఎస్‌బీఐ సిబ్బంది కిరణ్ కుమార్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణతోనే రక్షణ

విజయనగరం రింగురోడ్డు: దోమలను నియంత్రించడం ద్వారా డెంగ్యూ జ్వరాలు ప్రబల కుండా నివారించవచ్చునని జిల్లా మలేరియా నివారణాధికారి వై.మణి అన్నారు. నెల రోజుల పాటు డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సోమవారం దాసన్నపేటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీహెచ్‌ఈ ఓ‌ఎల్ ఎస్ నాయుడు, ఫైలేరియా యూనిట్ ఇన్‌చార్జి శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్స్ వీవీ ఎస్‌ఆర్ ప్రసాద్, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రత్యేక అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేయాలి

విజయనగరం రింగురోడ్డు: గురజాడ కేంద్ర గ్రంథాలయంలో వివిధ రకాల పోటీ పరీక్షల కోసం సన్నద్ధమయ్యే విద్యార్థుల కోసం ప్రత్యేక అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని జన విజ్ఞాన వేదిక నగర అధ్యక్షుడు శనగం శివాజీ కోరారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయ పరిసర ప్రాంతాల్లోని అద్దె గదుల్లో ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారని చెప్పారు. నిరుపేదలైన నిరుద్యోగులకు గురజాడ కేంద్ర గ్రంథాలయంలో ప్రత్యేకంగా అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. శీను, సూర్యనారాయణ, నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలను విక్రయించాలి

రామభద్రపురం: మండలంలో నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని.. నకిలీవి అమ్మితే కఠిన చర్యలు చేపడతామని మండల వ్యవసాయాధికారి వి.వెంకయ్య హెచ్చరించారు. మండల కేంద్రంలో ఉన్న పురుగు మందుల షాపులను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాపుల ఎదుట ధరల పట్టిక, స్టాకు లభ్యత బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఎంఆర్‌పీ కన్నా అధిక రేట్లకు విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఏవో కొండలరావు పాల్గొన్నారు.

నేడు ప్రజాదర్బార్

వంగర: వంగర ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సాల్మన్‌రాజ్ తెలిపారు. ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి అధికారులు పూర్తిసమాచారంతో హాజరుకావాలని కోరారు. ● **రేగిడి:** రేగిడి మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం ప్రజాసమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కోండ్రు ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్యామలాకుమారి సోమవారం తెలిపారు.

మొక్కుబడిగా వచ్చి వెళ్లారు

జామి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అధికారులు పూర్తి స్థాయిలో ఉండలేదు. సోమవారం పది గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ప్రారంభంలో 17 మంది అధికారులు హాజరయ్యారు. కాసేపటి తరువాత వీరిలో చాలా మంది వెళ్లిపోయారు. ఇదిచూసిన మండల వాసులు ఇలా అయితే తాము సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. ఈ విషయమై ఎంపీడీవో తిరుమలరావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారులు హాజరయ్యారని.. వారికి చిన్నపాటి పనులు ఉండడంతో సిబ్బందిని ఇక్కడ ఉంచి వెళ్లారని తెలిపారు.

'సర్పంచి భర్తపై ఫిర్యాదు చేస్తాం'

జామి: మండలంలోని రామయ్యపాలెం వైసీపీ మద్దతుదారు సర్పంచి భర్త పంచాయతీలో అనధికారంగా పెత్తనం చెలాయిస్తున్నారని, అంతేకాకుండా మహిళలతో అసభ్యంగా మాట్లాడుతున్నారని ఇటువంటివారిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదుచేస్తామని రామయ్యపాలెం మాజీ సర్పంచ్, టీడీపీ విశాఖపార్లమెంటరీ మహిళ ప్రతినిధి మాకిరెడ్డి శ్రీలక్ష్మి అన్నారు. సోమవారం ఆమె జామిలో విలేఖర్లతో మాట్లాడుతూ తాము ఉదయం 6గంటలకే పింఛన్లు ఇంటింటికీ తిరిగి అందిస్తుంటే తమను దూషించారన్నారు. ఇకపై ఇలా చేస్తే మహిళా కమిషన్‌కు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలున్నారు.

బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు

● ఎస్పీ దీపిక పాటిల్

విజయనగరం క్రైం, జూలై 1: జిల్లాలో ఎవరైనా బెదిరింపులు, దాడులు, దౌర్జన్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి... 43 ఫిర్యాదులు స్వీకరించారు. ● మెరకముడిదాం గ్రామానికి చెందిన వ్యక్తి ఎస్పీ దీపికకు ఫిర్యాదు చేస్తూ, తనకు వారసత్వంగా సంక్రమించిన భూమిని తమలోని భాగస్వామి ఒకరు ఆక్రమించుకుని బెదిరిస్తూ దాడులకు పాల్పడుతున్నారని, న్యాయం చేయాలని కోరారు. స్పందించిన ఆమె విచారణ చేపట్టి న్యాయం చేయాలని బూర్జివలస ఎస్ఐని ఆదేశించారు. ● జామి మండలం ఎం కొత్తవలస గ్రామానికి చెందిన వ్యక్తి తాను 4.19 ఎకరాలు భోగాపురం మండలం అమటం రావివలసలో కొనుగోలు చేశానిని... రెవెన్యూ రికార్డుల్లో తన పేరున, కుటుంబ సభ్యుల పేరున ఉన్నాయని తెలిపారు. భూమితో సంబంధం లేని వ్యక్తులు పనులు చేయకుండా అడ్డుకుని దౌర్జన్యానికి పాల్పడుతున్నారని, న్యాయం చేయాలని కోరారు. ● తెర్లాం మండలం లోచర్ల గ్రామానికి చెందిన మహిళ తాను తెలంగాణ రాష్ట్రానికి చెందిన వ్యక్తిని ప్రేమించి వివాహం చేసుకున్నానని, తనకు ఒక కుమారుడు జన్మించారని తెలిపారు. తన భర్త కాపురానికి తీసుకుని వెళ్తానని నమ్మించి, తెలంగాణకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. తన భర్త మరో వివాహం చేసుకున్నారని, న్యాయం చేయాలని కోరారు. ఫిర్యాదులను స్వీకరించిన ఎస్పీ దీపిక సంబంధిత అధికారులతో మాట్లాడుతూ వీటిపై విచారణ చేపట్టి ఏడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఆస్మాపరహీన్, డీఎస్పీ వీరకుమార్, సీఐ మురళి, నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత ప్రభుత్వం రూపొందించిన నూతన చట్టాలపై అవగాహన కల్పించి.. కరపత్రాలను ప్రజలకు అందించారు.


ఫిర్యాదుదారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ దీపిక

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం: అదితి

విజయనగరం రింగు రోడ్డు, జూలై 1: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. సోమవారం సాయంత్రం నగర పాలక సంస్థ కార్యాలయం నుంచి కోట వరకూ నిర్వహించిన స్టాప్ డయేరియా ర్యాలీని ఆమె ప్రారంభించారు. డయేరియా ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించే వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని.. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తగా వహించాలన్నారు. ఓఆర్ఎస్ ద్రావణాన్ని తరచూ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఎంఎం నాయుడు, సహాయ కమిషనర్ సీహెచ్ తిరుమల రావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.


జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

పేద విద్యార్థులకు వాసవీ క్లబ్ అండ

శృంగవరపుకోట రూరల్: పేద విద్యార్థులకు వాసవీ క్లబ్ అండగా ఉంటుందని క్లబ్ ఆర్‌సీ బాలనాగు శ్రీనివాస్, బొడ్డవర వాసవీ మహిళ క్లబ్ అధ్యక్షురాలు పూసర్ల కోటీరత్నం చెప్పారు. సోమవారం మండలంలోని లచ్చందొరపాలెం, అమ్మపాలెం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, ఇతర విద్యా సామగ్రి అందించారు. ఈ కార్యక్రమంలో కందుకూరి రమేష్, పద్మావతి, శైలజ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


వాసవి క్లబ్ అందించిన నోట్‌బుక్స్, విద్యాసామగ్రితో విద్యార్థులు

పెద్దశిర్లాం ఆయకట్టుకు నీరందిస్తాం

రేగిడి: పెద్దశిర్లాం ఆయకట్టుకు నీరందిస్తామని రైతులకు రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహనరావు హామీఇచ్చారు. మడ్డువలస, తోటపల్లి బ్రాంచ్ కాలువలు చెంతనే ఉన్నా సాగు నీరందడం లేదని, కాగితాపల్లి- పెద్దశిర్లాం సరిహద్దు మీదుగా వెళ్తున్న తోటపల్లి బ్రాంచ్ కాలువను మరో 150 మీటర్లు తవ్వితే తమ గ్రామంలోని 350 ఎకరాలకు సాగునీరు అందుతుందని, ఈమేరకు దృష్టిసారించాలని పెద్దశిర్లాం రైతులు రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహనరావుకు వివరించారు. కాగితాపల్లి వచ్చిన కోండ్రును మంగళవారం పెద్దశిర్లాం రైతులు పొలాల వద్దకు తీసుకువెళ్లి తోటపల్లి సమస్యను వివరించారు. ఆయన వెంట నాయకులు దూబ ధర్మారావు, కిమిడి అశోక్‌కుమార్, గురవాన ధనంజయ్‌రావు, గురవాన నారాయణరావు ఉన్నారు.


పెద్దశిర్లాం వద్ద నిలిచిన తోటపల్లి కాలువ పనులను పరిశీలిస్తున్న కోండ్రు

బీపీఎం లేక వెనుదిరిగిన దర్యాప్తు సిబ్బంది

వంగర: బాగెమ్మపేటలో బీపీఎం అందుబాటులో లేకపోవడంతో దర్యాప్తు సిబ్బంది వెనుదిరిగారు. బాగెమ్మపేట బీపీఎం అనూష గత కొద్దిరోజులుగా పోస్టాఫీసుకు రాకపోగా పలువురు ఫోన్లుచేసినా స్పందించకపోవడంతో గ్రామస్థులు అరసాడలోని ఎస్‌వో కార్యాలయానికి ఫిర్యాదుచేశారు. దీంతో ఈ విషయాన్ని ఎస్‌వో ఉన్నతాధికారులకు తెలియజేయడంతో దర్యాప్తునకు అధికారులు ఆదేశించారు. ఈ మేరకు సోమవారం పోస్టల్ ఇన్‌స్పెక్టర్ వేగిరెడ్డి అప్పలనాయుడు గ్రామానికి చేరుకున్నా పోస్టుమాస్టర్ లేకపోవడంతో ఫోన్‌చేసి దర్యాప్తునకు పిలవడానికి ప్రయత్నించారు. అయితే ఫోన్‌లో స్పందించక పోవడంతో అధికారులకు సమాచారం అందించారు. నేరుగా పోస్టుమాస్టర్ ఇంటికి మనిషిని పంపించినా బీపీఎం దొరకలేదు. దీంతో పోస్టాఫీసుకు తనిఖీకి వచ్చిన సిబ్బంది సాయంత్రం వరకు గ్రామంలో ఉండి వెనుదిరుగారు. బీపీఎం ఆర్డీలు కట్టేందుకు వినియోగదారులు ఇచ్చిన డబ్బులు కట్టకుండా దుర్వినియోగం చేసినట్లు పలువురు తెలిపారు. కాగా సోమవారం దర్యాప్తుకు అధికారులు సిద్ధమైనప్పటికీ ఎవరికి తెలియకుండా అరసాడ ఎస్‌వో కార్యాలయంలో రూ.70 వేలు జమ చేసినట్లు పలువురు యూనియన్ నాయకులు చెప్పారు. దర్యాప్తుకోసం పోస్టాఫీసుకు వెళ్లినా అనూష అందుబాటులో లేని విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించినట్లు ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు తెలిపారు.


మూసి ఉన్న బాగెమ్మపేట పోస్టాఫీసు

కొత్త క్రిమినల్ చట్టాల అమలుపై నిరసన

కొత్తవలస: కేంద్రప్రభుత్వం సోమవారం నుంచి కొత్తగా తీసుకొచ్చిన క్రిమినల్ చట్టాలకు నిరసనగా కొత్తవలస న్యాయవాద సంఘానికి చెందిన న్యాయవాదులు కోర్టు ఆవరణలో కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. కేంద్రప్రభుత్వం ఐపీసీ, సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ చట్టాల స్థానంలో కొత్త చట్టాలను తీసుకొచ్చి సోమవారం నుంచి అమలులోకి తెచ్చారు. ఈచట్టాలను వ్యతిరేఖిస్తూ వీటి అమలును కొద్ది రోజులుపాటు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాద సంఘం అధ్యక్షురాలు డీవీఎల్ దేవితో పాటు న్యాయవాదులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కేంద్రమంత్రికి అభినందన

విజయనగరం దాసన్నపేట, జూలై 1: కేంద్ర పౌర విమానాయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును జిల్లా శిష్టక రణ సంఘం అధ్యక్షులు ఎంపీజీ ఈశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం ఆయన నివాసంలో అభినందించారు. శిష్టకరణాలను ఓబీసీలో చేర్చేందుకు కృషి చేయాలని కోరారు. మంత్రి రామ్మోహన్‌నాయుడు సానుకూలంగా స్పందించారు. మంత్రిని కలిసిన వారిలో సంఘ ప్రతినిధులు సంజీవ రావు, త్యాడ ప్రసాద్‌పట్నాయక్, కుదుమ పరమేశ్వరరావు, ఏటీ వరప్రసాద్, ఎంపీ తిరుపతిరావు, బుదరాయవలస మధుసూదనరావు, లోచర్ల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.


కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడిని సత్కరిస్తున్న శిష్టకరణ సంఘ ప్రతినిధులు

చెత్త సంపద కేంద్రం నిర్మాణం

వంగర: అరసాడలో చెత్తసంపద కేంద్రం తొలగించిన చోటే నిర్మించారు. గ్రామంలో గతంలో టీడీపీ సానుభూతిపరులుగా వ్యవహరిస్తున్న ఎల్.ధనలక్ష్మి మండలానికే మోడల్‌గా చెత్తసంపదకేంద్రం నిర్మించారు. గ్రామంలో చెత్త సేకరణ చేయించి ఎరువుల తయారీకి అవసరమైన చర్యలు తీసుకున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు గుర్తించారు. ఇంతలోనే ప్రభుత్వం మారింది. మండలంలోని ఓ వైసీపీ నాయకుడు గ్రామంలో చెత్త సంపదకేంద్రం రాత్రికి రాత్రి తొలగించారు. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతిలో టీడీపీపై అక్కసుతో.. చెత్తసంపద కేంద్రం కొల్లగొట్టారు. శీర్షికతో ప్రచురించిన కథనానికి అప్పటి కలెక్టర్ నాగలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారులు స్పందించారు. ప్రభుత్వ ధనం కొల్లగొడితే ఏం చేస్తున్నారని ఈవో పీర్డీ విజయభాస్కర్, కార్యదర్శి వేణులకు మెమోలు జారీ చేశారు. తొలగించిన ప్రదేశంలో వెంటనే నిర్మించకపోతే సస్పెండ్ చేస్తానని హెచ్చరించడంతో పనులు చేపట్టారు. మరో రెండు రోజుల్లో భవనం పనులు పూర్తిచేస్తామని వేణు తెలిపారు.


తొలగించిన ప్రాంతంలో మళ్లీ నిర్మించిన చెత్తసంపద కేంద్రం

ఘనంగా కళా పుట్టిన రోజు వేడుకలు


కళాను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

చీపురుపల్లి: ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు పుట్టిన రోజు వేడుకలను సోమవారం చీపురుపల్లి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. నాలుగు మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఆయన కేక్ కట్ చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది కళాకు శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు ఆయన శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు, గద్దే బాబూరావు, కుచ్చర్లపాటి త్రిమూర్తులరాజు, నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, తాడ్డె సన్యాసినాయుడు, కోట్ల మోతీలాల్‌నాయుడు, తాడ్డె చంద్రశేఖర్, పైల బలరాం, సారేపాక సురేష్, వెన్నె సన్యాసినాయుడు, తిరుమలరాజు కిరణ్‌కుమార్, ముల్లు రమణ పాల్గొన్నారు. ● **రాజాం:** కళా వెంకటరావుకు రాజాం క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎస్సీ సెల్ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మరెన్నో పుట్టిన రోజులు జరుపుకోవాలని ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావాడ సీతారాం అన్నారు. టీడీపీ విజయానికి తోడ్పాటు అందించిన వారికి సరైన స్థానం కల్పించేలా తన వంతు కృషి చేస్తానని కళావెంకటరావు హామీ ఇచ్చారు. రేగాన రామారావు, తేగల శంకర్, రేగాన అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. ● కళావెంకటరావుకు జన్మదిన సందర్భంగా పలువురు నాయకులు అభిమానులు రాజాం క్యాంపు కార్యాలయానికి చేరుకుని శుభాకాంక్షలు తెలిపారు. వంగర మాజీ జడ్పీటీసీ సభ్యుడు బొత్స వాసుదేవరావు నాయుడు శాలువతో సత్కరించారు. జీఎంఆర్‌పీఏ రెడ్డి అన్నంనాయుడు, మాజీ ఎంపీపీ పైల వెంకటరమణ, ఉదయాన మురళీకృష్ణ, టంకాల వెంకటేషం, శాసపు కేశవనాయుడు, పెంకి చైతన్యకుమార్, వైకుంఠరావు, తూర్పుకాపు సంక్షేమ సంఘం నాయకులు పాలవలస శ్రీనివాసరావు, ఆర్‌వీకే నాయుడు, బెవర శ్రీనివాసరావు, కళాను కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

పండగ వాతావరణం కనిపించింది

శృంగవరపుకోట: ఎన్‌డీఏ కూటమి పెంచిన పింఛన్లను సోమవారం పంపిణీ చేయడంతో పల్లెల్లో పండగ వాతావరణం కనిపించిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ అన్నారు. శృంగవరపుకోట కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సోమవారం మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం చంద్రబాబు నాయుడు భారీగా పింఛను మొత్తాన్ని పెంచారన్నారు. కూటమి ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలన్నీ ఈ విధంగానే అమలవుతాయన్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు రూ.250 చొప్పున పెంచి గొప్పలు చెప్పుకున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, జుత్తాడ రామసత్యం, గొర్రిపోటు రమణ, ముక్కా రామకృష్ణ, మంగరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గొంప కృష్ణ

టోల్‌ప్లాజాను తొలగించండి

డెంకాడ: డెంకాడ మండలం జొన్నాడ వద్ద నూతనంగా నిర్మిస్తున్న టోల్‌ప్లాజాను వెంటనే తొలగించాలని పౌరవేదిక ప్రతినిధులు, విజయనగరం జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ డిమాండ్ చేశారు. పౌర వేదిక ప్రతినిధులు, స్థానిక ప్రజలతో కలిసి సోమవారం టోల్‌ప్లాజా వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రఘువర్మ మాట్లాడుతూ ఈ టోల్ ప్లాజా వల్ల విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విశాలమైన రోడ్లు, విస్తరణ లేకుండా ప్రజలను అడ్డగోలుగా దోచుకోవడానికి టోల్‌ప్లాజా నిర్మించారని రఘువర్మ మండిపడ్డారు. పౌర వేదిక జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ టోల్ వసూళ్లను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, తాను గెలిచిన వెంటనే శివాజీపాలెం (గాజువాక) టోల్‌ప్లాజాని లేకుండా చేస్తానని చెప్పి మాట నిలబెట్టుకున్నారని గుర్తుచేశారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు వెంటనే టోల్‌ప్లాజా తొలగింపునకు కృషి చేయాలని భీశెట్టి కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో వేదిక కార్యదర్శి జలంత్రి రామచంద్ర రాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రొంగలి పోతన్న, చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు జాగరపు ఈశ్వర్ ప్రసాద్, పౌర వేదిక ఉపాధ్యక్షుడు పిడకల ప్రభాకర రావు, మానవ హక్కుల సంఘ అధ్యక్షుడు అచ్చిరెడ్డి, యువజన నాయకుడు కరుణాకర్, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


టోల్‌గేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న పౌరవేదిక ప్రతినిధులు, నాయకులు

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆటో

భోగాపురం: మండలం అమటాంరాయవలస సమీప జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొనడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. సోమవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా సంతకవిటికి చెందిన గాయత్రీ పద్మనాభం, గాయత్రీ హేమలత, పార్వతమ్మ చేపలవ్యాపారం నిమిత్తం శ్రీకాకుళం వైపునుంచి విశాఖ వైపు ఆటోలో వెళ్తున్నారు. అమటాంరాయవలస సమీప జాతీయరహదారిపైకి వచ్చే సరికి అదే రహదారిలో ఆగిఉన్న లారీని ఆటో వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ భగవాన్‌కు స్వల్పగాయాలు అయ్యాయి. వీరు ప్రస్తుతం విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

రాజాం: పీహెచ్‌సీల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆదేశించారు. సోమవారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో పొగిరి, బొద్దాం, బూరాడ, రేగిడి, వంగర, మండాకురిటి, సంతకవిటి పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది కలిశారు. కార్యక్రమంలో వైద్యులు భార్గవి. నరేంద్ర. చలమయ్య. మనిషా అప్పలనాయుడు. శశికిరణ్‌కుమారి పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయండి

రాజాం పురపాలక సంఘం కార్యాలయం ఆవరణలో స్టాప్ డయేరియా బ్రోచర్‌ను ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు అర్హులైన పిల్లలు ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి జింక్ మాత్రలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పురపాలక సంఘం కమిషనర్ జె.రామప్పలనాయుడు, అర్బన్ పీహెచ్‌సీ వైద్యులు అనూష పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వేపాడ: వర్షాకాలంలో కీటక జనిత వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల జడ్పీటీసీ సభ్యుడు శానాపతి అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రం వేపాడమండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో భాగంగా డయేరియా గోడపత్రికను ఆవిష్కరించారు. ఎంపీడీవో నిచ్చల, ఎంఈవో భాలభాస్కరరావు, ఈవోపీఆర్డీ ఉమ, సీహెచ్‌వో ఆంజనేయులు, వెలుగు ఏపీఎం వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన

బాడంగి: స్థానిక పోలీసు స్టేషన్‌లో కొత్త చట్టాలపై ఏఎస్ఐ కొండలరావు పలువురు పెద్దలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ గుణుపూరు స్వామినాయుడు, ఆటో యూనియన్ ప్రతినిదులు పాల్గొన్నారు.

● గుర్ల పోలీసు స్టేషన్‌లో కొత్తచట్టాలైన భారతీయ న్యాయ సంహితపై ఎస్ఐ భాస్కరరావు సోమవారం అవగాహన కల్పించారు. అలాగే ద్విచక్రవాహనదారులకు కూడా అవగాహన కల్పించారు.

అంగన్‌వాడీ, ఆశాలను ఆదుకోవాలి

బాడంగి: బాడంగిలో పింఛన్ల పంపిణీకి వచ్చిన బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయనకు అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు వినతిపత్రాలు అందజేశారు. తమ సమస్యలను తీర్చాలని ఆయన వివరించారు.

పడాలపేటలో స్వీట్ల పంపిణీ

విజయనగరం రూరల్ : విజయనగరం మండల పరిధిలోని పడాలపేట గ్రామంలో టీడీపీ, జనసేన శ్రేణులు సంబరాలు నిర్వహించాయి. పింఛను మొత్తాన్ని పెంచిన నేపథ్యంలో సోమవారం పడాలపేటలో పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి మిఠాయిలు, గులాబీ మొక్కలను అందజేశారు.

4న బంద్‌ను విజయవంతం చేయండి

శృంగవరపుకోట: ఈనెల 4న జరగనున్న దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్.ఎఫ్.ఐ) మండల ఉపాధ్యక్షుడు చరణ్, చైతన్య, భారతి, రవి తదితరులు కోరారు. సోమవారం శృంగవరపుకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గోడపత్రికను ఆవిష్కరించారు. నిట్ స్కామ్‌పై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

ప్లాంట్‌ను నేలపాలు చేసిన వారిపై విచారణకు డిమాండ్

విజయనగరం దాసన్నపేట: ద్వారపూడి గ్రామం వద్ద కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు రూ.4 కోట్ల 80 లక్షలతో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్‌ను నిర్లక్ష్యంతో నేలపాలు చేసిన వారిపై విచారణ చేపట్టాలని ఉత్తరాంధ్ర అంబేద్కర్ రైట్స్ ప్రతినిధులు పొంద్రంకి వెంకట రమణ, గంటా వీర్రాజు డిమాండ్ చేశారు. సోమవారం రైల్వే స్టేషన్ సమీపంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ నగర పాలక సంస్థ అధికారులు, పాలకులు, ఉద్దేశపూర్వకంగా ప్లాంటును నాశనం చేశారన్నారు. తక్షణమే సమగ్రంగా సీబీసీఐడీ విచారణ జరిపించి తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుత్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

కొత్తవలస: విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే ఎంత అసౌకర్యానికి గురవుతామో విద్యుత్ విషయంలో అంత జాగ్రత్తగా లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని విద్యుత్‌శాఖ డిప్యూటీ ఇనస్పెక్టర్ ప్రదీప్ కుమార్ అన్నారు. విద్యుత్ భద్రతా వారోత్సవాలు సందర్భంగా సోమవారం మండలంలోని కంటకాపల్లి జడ్పీహైస్కూల్‌కు చెందిన విద్యార్థులకు శారదా కర్మాగారం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శారదా కర్మాగార ప్రతినిధులు సన్యాశిరావు, వెంకటరావు, నాగరాజు, శంకరరావు, పాల్గొన్నారు.

కళాశాల హాస్టల్‌లో మెనూ ఏదీ?

బొబ్బిలి: స్థానిక గ్రోత్‌సెంటరు సమీపంలో గల కళాశాల విద్యార్థుల వసతి గృహంలో సక్రమంగా మెనూ పాటించడం లేదని ఏపీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.సాయికిరణ్ యాదవ్ ఆరోపించారు. సోమవారం సాయంత్రం హాస్టల్ పరిస్థితులను పరిశీలించారు. ఇటీవల కొత్త వార్డెన్ వచ్చారని.. ఆయన ఎవరో ఇంతవరకు విద్యార్థులకు తెలియకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

డయేరియా నుంచి కాపాడుకోవాలి

కొత్తవలస: అతిసార నుంచి పిల్లలను రక్షించుకోవాలని ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ అన్నారు. సోమవారం అతిసార నివారణ కార్యక్రమంలో బాగంగా వియ్యంపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వియ్యంపేటలో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి గోపాలకృష్ణ, సర్పంచ్ పులిబంటి రాము, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ● **రాజాం:** చిన్నారుల విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని బొద్దాం వైద్యాధికారి బి.నరేంద్ర సూచించారు. సోమవారం బొద్దాం గ్రామంలో పిల్లలకు డయేరియా వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు. ● **విజయనగరం రూరల్:** రాకోడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డయేరియాపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డయేరియా రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై కరపత్రాలను పంపిణీ చేశారు.

కొత్త చట్టాలపై అవగాహన తప్పనిసరి

రామభద్ర పురం: కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన చట్టాలపై అందరూ అవగాహన కల్పించుకోవాలని డీఎస్పీ శ్రీనివాసరావు కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం సాయంత్రం ప్రజలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్ఐ జ్ఞాన ప్రసాద్, ఏఎస్ చిన్నయ్య, సిబ్బంది పాల్గొన్నారు.


రామభద్రపురం: మాట్లాడుతున్న డీఎస్పీ

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో ఎస్ఐగా పనిచేసి పదవీవిరమణ చేసిన చదలవాడ సత్యనారాయణ నిబద్ధత కలిగిన మానవతావాది అని డీఎస్పీ పి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక బృందావనం ఫంక్షన్‌హాలులో ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో చదలవాడ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు పాల్గొన్నారు.

విజయనగరం క్రైం: భారతీయ చట్టాలపై ప్రజలంతా తప్పనిసరిగా అవగాహన పెంపొందించుకోవాలని విజయనగరం డీఎస్పీ గోవిందరావు సూచించారు. సోమవారం విజయనగరం రూరల్ పోలీసుస్టేషన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ నూతన చట్టాల గురించి వివరించారు ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్ఐ వాసుదేవరావు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. ● నగరంలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో నూతన చట్టాలపై సోమవారం సీఐ వెంకటరావు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు నవీన్ పడాల్, హరిబాబు నాయుడు, నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.


విజయనగరం: అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ గోవిందరావు

అగ్నిమాపక సిబ్బంది కోసం భవనం: జయకృష్ణ



అగ్నిమాపక కేంద్రాన్ని పరిశీలిస్తున్న జయకృష్ణ

పాలకొండ: అగ్నిమాపక సిబ్బంది కోసం నూతన భవన నిర్మాణం కోసం కృషి చేస్తానని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు. సోమవారం పాలకొండలోని వీరఘట్టం రోడ్డులో గల శిథిలావస్థకు చేరుకున్న అగ్నిమాపక కేంద్రాన్ని పరిశీలించారు. అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. పూర్తిగా శిథిలమైన భవనంలో ఉండలేక రేకుల షెడ్‌లో తలదా చుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లా కొండలరావు, గండి రామినాయుడు, గంటా సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

సక్రమంగా పింఛన్లు పంపిణీ చేయాలి: భూదేవి



మాట్లాడుతున్న భూదేవి

వీరఘట్టం: లబ్ధిదారులకు పింఛన్లను సక్రమంగా పంపిణీ చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి కోరారు. సోమవారం వీరఘట్టంలో టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. వీరఘట్టంలో త్వరలో పార్టీ కార్యాలయం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుజ్జి, వెంకటరమణ, పక్కి రవికుమార్, జీవరత్నం, ముఖలింగం, అల్లు సత్యనారాయణ, గర్భాన శ్రీనివాసరావు, ఎం.అప్పలనాయుడు పాల్గొన్నారు.

ప్యాలెస్‌ల పిచ్చితో ప్రజాధనం వృథా

● పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

పార్వతీపురం టౌన్: ప్యాలెస్‌ల పిచ్చితో ప్రజాధనాన్ని వృథా చేయడంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముందున్నాడని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర విమర్శించారు. పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మితమవుతున్న వైసీపీ కార్యాలయాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సొమ్ముతో రాష్ట్రంలోని 26 జిల్లాల్లో వైసీపీ కార్యాలయాలను కోట్లాది రూపాయలతో నిర్మించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఎకరా 18 సెంట్ల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని సంవత్సరానికి రూ.వెయ్యి చెల్లించి లీజు ప్రాతిపదికన సొంతం చేసుకోవడానికి కుట్రలు పన్నారని ఆరోపించారు. ఈ అక్రమ భవనాలపై అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. వైసీపీ కార్యాలయ నిర్మాణం జరగకుండా రెండో నోటీసును కూడా కాంట్రాక్టర్‌కు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు డి.శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు బి.సీతారామ్, ఎం.వెంకటేష్ పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలి: సీఐ

సాలూరు: అమలులోకి వచ్చిన కొత్త చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని పట్టణ సీఐ వాసునాయుడు కోరారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఆయన కొత్త చట్టాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ నేర వ్యవస్థలో విస్తృత మార్పులు తీసుకొచ్చే కొత్త నేర చట్టాలు సోమవారం నుంచి అమలులోకి వచ్చాయని చెప్పారు. బ్రిటీష్ కాలం నాటి ఇండియన్ పీనల్ కోడ్ ఇక మీదట భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్)గా, కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ భారతీయ నాగరిక సురక్షగా, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ భారతీయ సాక్ష్య అధినియమ్‌గా మారాయని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఉషశ్రీ పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

భామిని: డయేరియాపై అప్రమత్తంగా ఉండాలని బత్తిలి వైద్యాధికారి దామోదర్ తెలిపారు. సోమవారం బత్తిలిలో డయేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల టీచర్ల పోస్టులు డీఎస్సీలో కలపవద్దు



వినతిపత్రం అందజేస్తున్న గెస్ట్ టీచర్లు

గుమ్మలక్ష్మీపురం: గురుకులాల్లోని టీచర్ల పోస్టులు డీఎస్సీలో కలపవద్దని ఏపీ గిరిజన గురుకుల బాలికల పాఠశాలలు, కళాశాలలకు చెందిన గెస్ట్ టీచర్లు కోరారు. ఈ మేరకు సోమవారం భద్రగిరి పీటీజీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము 15 సంవత్సరాలు నుంచి గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో అరకొర జీతాలతో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీలో కలవద్దని కోరారు. 2003 నుంచి చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్నామని చెప్పారు. మెగా డీఎస్సీలో తమ ఔట్‌సోర్సింగ్ పోస్టులను కలపడం దారుణమని, రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి తమను ఆదుకోవాలని కోరారు.

ఘాట్‌రోడ్డులో పైనాపిల్ వ్యాన్ బోల్తా

సీతంపేట:మండలంలోని మొగదార, రుక్మిణిగూడ ఘాట్‌రోడ్డులో అదుపు తప్పి ఆదివారం రాత్రి పైనాపిల్ వ్యాన్ బోల్తాపడింది. విశాఖ పట్నం ప్రాంతానికి చెందిన వారు పైనాపిల్ కొనుగోలు చేసుకొని కిందకు వ్యాన్ దిగుతుండగా బ్రేకులు ఫెయిల్ కావడంతో అదుపుతప్పి లోయలోకి పడింది. దీంతో డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు.వెంటనే బోల్తాపడిన వ్యాన్‌ను బయటకు తీసినట్లు స్థానికులు తెలిపారు.

'మీకోసం'లో 14 వినతులు

సీతంపేట: స్థానిక ఐటీడీఏ ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కా ర వేదిక(మీకోసం)లో 14 వినతులు వచ్చి నట్లు ఏపీవో వెంకట గణేష్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర, డిప్యూటీ ఎడ్యు కేషనల్ అధి కారి పి.నారాయుడు, జీసీసీమేనేజర్ దాసరి కృష్ణ, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 43 మంది ఎంపిక

సీతంపేట: సీతంపేట వైటీసీలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాలో జీఎంఆర్ రక్ష సెక్యూరిటీ ఉద్యోగానికి 43 మంది ఎంపిక చేపినట్లు శిక్షణకేంద్రం ప్రోగ్రాం మేనేజర్ వెంకటరమణ తెలిపారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శుభం బన్సల్ ఆదేశాల మేరకు జాబ్‌మేళా నిర్వహించినట్లు చెప్పారు. కార్య క్రమంలో జీఎంఆర్ ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి హనుమంతురావు, సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

ఒడిశా



వైశ్య సంఘం కార్యవర్గం ఎన్నిక

రాయగడ: స్థానిక బాలాజీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో రాయగడ కళింగ వైశ్యసంఘం కార్యవర్గ ఎన్నిక సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా కింతలి ఆమరనాథ్ ఉపాధ్యక్షుడిగా గోపలశెట్టి ఈశ్వర్, కార్యదర్శిగా టంకాల జయరాం, సంయుక్త కార్యదర్శిగా చిన్నారి విజయ్‌కుమార్, కోశాధికారిగా, వడ్డీ మురళీ కృష్ణలను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా బరాటం రాంప్రసాద్ వ్యవహరించారు.

రాయగడలో హస్తకళల ఎగ్జిబిషన్

రాయగడ: రాయగడ మహిళా సంస్కృతి భవన్‌లో హస్తకళల ఎగ్జిబిషన్ ఏర్పాటుచేశారు. మహిళలు తయారు చేసిన పలు రకాల హస్తకళా వస్తువులను ప్రదర్శనకు ఉంచారు.ఆర్ట్స్ అండ్‌క్రాఫ్ట్ డిజైన్ శిక్షకురాలు కస్తూరి సాహూ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో లయిన్స్ అధ్యక్షురాలు టి.రశ్మిత కటక్, టిట్లాఘర్‌లో తయారు చేసిన వస్తువులను తెచ్చిన వ్యాపారస్తులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో 51 వినతులు

రాయగడ: ఎన్నికల వల్ల నిలిపివేసిన గ్రీవెన్స్ ఎట్టకేలకు ప్రారంభమయ్యింది. ఈ మేరకు జిల్లా పరిషత్ సమావేశ హాలులో కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ అధ్యక్షతన జరిగిన గ్రీవెన్స్‌లో 51 వినతులు అందాయి.



సాలూరు రూరల్: కందులపథంలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న సంధ్యారాణి



కురుపాం: పాలభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్రదేవ్



పార్వతీపురం రూరల్: నర్సిపురంలో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, టీడీపీ నాయకులు

పింఛన్లతో లబ్ధిదారులకు ఆర్థిక భరోసా

● పెంచిన మొత్తాలను పంపిణీచేసిన అధికారులు, టీడీపీ, జనసేన, బీజేపీ ప్రజాప్రతినిధులు

ప్రభుత్వం పింఛన్ల మొత్తాన్ని పెంచడం వల్ల లబ్ధిదారులకు ఆర్థిక భరోసా లభిస్తుందని అధికారులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. సోమవారం పెంచిన సామాజిక భద్రతా పింఛన్ల నగదు మొత్తాలను లబ్ధిదారులకు ఇంటింటికి వెళ్లి పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, సచివాలయ సిబ్బంది వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ తదితర పింఛన్ల నగదుతోపాటు సీఎం చంద్రబాబునాయుడు పంపించిన సందేశం పత్రాలు అందజేశారు. జూలై నెల పింఛన్ నాలుగు వేలు, ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి పెంచిన మూడు వేలు కలిపి పంపిణీచేశారు. కాగా సీఎం చంద్రబాబు, పీఎం మోదీ, పవన్ కళ్యాణ్, లోకేశ్ చిత్రపటానికి పాలభిషేకం చేశారు.

పెద్దకొడుకులా చంద్రబాబు బాధ్యత: సంధ్యారాణి

సాలూరు:ఇంటికి పెద్దకొడుకులా చంద్రబాబు నాయుడు బాధ్యత తీసుకున్నారని గిరిజన సంక్షేమ, మహిళా, శిశుసంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.పట్టణంలోని 21వ వార్డు గొల్లవీధిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, కౌన్సిలర్ బందాపు సీతమ్మ, వైదేహి, హర్ష, వరలక్ష్మి పాల్గొన్నారు.

●**సాలూరు రూరల్:** కందులపథంలోమంత్రి గుమ్మిడి సంధ్యారాణి పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆముదాల పరమేశు, పార్టీ నాయకులు మత్స శ్యాం, ఖరాసవలస ఎంపీటీసీ అప్పికొండ రమాదేవి, ఎక్కుడు గణపతి, వెంకటరమణ, యుగంధర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు. ● **పాచిపెంట:** మంచాడవలసలో మంత్రి సంధ్యారాణి పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్పీ భంజ్‌దేవ్, పార్టీ మండల అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్‌బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● **మక్కువ:** కవిరిపల్లిలో మంత్రి సంధ్యారాణి పింఛన్లు పంపిణీ చేశారు. కూటమి నాయకులు గుల్ల వేణుగోపాల్, పరమేష్, గేదెల రిషివర్ధన్, పెంట సత్యం మాస్టార్, ఎంపీడీవో దేవకుమార్ పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్నారు: జగదీశ్వరి

కురుపాం: ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్ వెయ్యి రూపాయలు పెంచి ముఖ్యమంత్రి చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మంతినివలసలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమెతోపాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.అప్పారావు, తెలుగుయువత అధికార ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్, టీడీపీ నాయకులు నందివాడ కృష్ణబాబు, జీవీ రమణమూర్తి, సుకేష్ చంద్రపండా, ఆకుల రమేష్, కర్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

●**గుమ్మలక్ష్మీపురం:** గుమ్మలక్ష్మీపురంలో ఎమ్మెల్యే జగదీశ్వరి పింఛన్లు పంపిణీ చేశారు. కార్య క్రమంలో టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి చంద్రబాబు: విజయ్‌చంద్ర

పార్వతీపురం రూరల్: పేదల పక్షపాతి ముఖ్యమం త్రి చంద్రబాబు నాయుడు అని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. నర్సిపురంలో పింఛన్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొట్టాపు వెంకటరమణ,ఎంపీటీసీ సభ్యుడు తవిటినాయుడు, జనసేన నాయకురాలు ఆగూరు మణి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ పింఛన్ పథకంతో భరోసా: జయకృష్ణ

●**పాలకొండ/సీతంపేట/వీరఘట్టం:**వృద్ధులు, దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలు గల వారికి ఎన్టీఆర్ పింఛన్ పథకంతో భరోసా లభిస్తోందని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు. పాలకొండలోని గారమ్మ కాలనీలోని పింఛన్లను పంపిణీచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లా కొండలరావు, సంతోష్ కుమార్, తేజోవతి,రామినాయుడు, కనపాక చౌదరినాయుడు, సుంకరి అనీల్‌దత్, అడపా బాబ్జీ, శాసపు రాంబాబు, తమ్మారావు పాల్గొన్నారు. పనుకువలసలో పింఛన్లను పంపిణీచేశారు. సీతంపేట మండలంలోని పెద్దూరు సచివాలయం పరిధిలోని వలగెడ్డలో పింఛన్లు అంద జేశారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి, ఎంపీడీవో గీతాంజలి, హెచ్. ప్రసాద్, ఇమరిక పవన్, సర్పంచ్ కళావతి పాల్గొన్నా రు. వీరఘట్టంలో కూడా పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీరఘట్టం టీడీపీ మండలాధ్యక్షుడు ఉదయాన ఉదయ్‌భాస్కర్, నాయకులు లక్ష్మీనారాయణ, బల్ల హరిబాబు పాల్గొన్నారు.

● **జియ్యమ్మవలస:**చినమేరంగి పంచాయతీలో ఎంపీపీ బొంగు సురేష్ సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు దత్తి లక్ష్మణరావు, డొంకాడ రామకృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ మజ్జి చంద్రమౌళి, మాజీ సర్పంచ్ బొత్స సూర్యప్రకాశరావు తదితరులు ఉన్నారు.

● **గరుగుబిల్లి:** మండలంలోని 25 పంచాయతీల పరిధిలో సుమారు 95 శాతం పింఛన్లు పంపిణీ జరిగిందని, 8,367గాను 7,910 పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీవో పి.సూర్యనారాయణ తెలిపారు. పంచాయతీకి పది మంది చొప్పున మొత్తం 133 మంది సిబ్బంది పంపిణీ చేశారని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో ఎన్.నాగభూషణరావు, ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరా వు, వెలుగు ఏపీఎం అప్పలనాయుడు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పర్యవేక్షించారు. అలాగే పెద్దూరులో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి మర్రాపు పురుషోత్తం నాయుడు పింఛన్లు పంపిణీ చేశారు. నాగూరు, దత్తివలస, చిలకాంలో టీడీపీ మండలాధ్యక్షులు అక్కేన మధుసూదనరావు, నాగూరు ఎంపీటీసీ, అరకు టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీచేశారు. రావివలసలో ఎంపీటీసీ సభ్యులు కోట భరత్‌కుమార్ ఆధ్వర్యంలో, లఖనాపురంలో ముదిలిబాబు విజయవాం కుశం, గిజబలో ఎంపీటీసీ ఎం.సింహాచలంనాయుడు, ఉల్లిభద్రలో మరడాన నారాయణస్వామి, బోనెలవెంకటి, తంగుడు ఆనందరావు, గరుగుబిల్లిలో యడ్ల శ్రీనివాసరావు, రావుపల్లిలో బోను సత్యనారాయణనాయుడు మాస్టారు, ఎస్. సింహాచలం, బి.రోహిణి, కొత్తపల్లిలో గొట్టాపు లక్ష్మంనాయుడు, త్రినాధరా వు, సొంబన్నవలస, మరుపెంటలో బలరాంనాయుడు, అక్కేన నారాయణరావు, గులిపల్లి రామారావులు ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ నిర్వహించారు.

● **కొమరాడ:** మండలంలో 20 గ్రామ సచివాలయాల్లో 8,562 మందికి 8,117మంది లబ్ధిదారులకు రూ.5కోట్ల 50లక్షల 29వేలు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో మల్లికార్జునరావు తెలిపారు. మండలంలో 94.8 శాతం పింఛన్లు పంపిణీపూర్తయిందని పేర్కొన్నారు. మిగిలినవి మంగళవారం పంపిణీ చేస్తామని చెప్పారు.

● **కురుపాం రూరల్:** మొండెంఖల్‌లో సచివాలయం సిబ్బంది, నాయకులు రంజిత్‌కుమార్ నాయిక్, పొందర బలరాం, భగవాన్ మిశ్రో, బెహరా శ్రీనివాసరావు, తిరుపతిరావు పింఛన్లు అందజేశారు.

● **మక్కువ:** మండలంలోని కొయ్యానపేట పంచాయతీకి చెందిన గొర్లె ఎల్లమ్మ అనారోగ్యంతో పార్వతీపురం ఏరియా ఆసుప త్రిలో చికిత్స పొందుతుండగా కార్యదర్శి జగన్మోహన్‌రావు ఆసుపత్రికి వెళ్లి పింఛను అందించారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోండి

● ఎంపీడీవో కార్యాలయంలో జోగులడుమ్మ గ్రామస్థుల వినతి



ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు చేస్తున్న జోగులడుమ్మ గ్రామస్థులు

జియ్యమ్మవలస: తమ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల్లో తీవ్ర అవినీతికి పాల్పడుతున్న క్షేత్ర సహాయకురాలు బి.నాగమణిపై చర్యలు తీసుకోవాలని జోగులడుమ్మ ప్రజలు డిమాండ్‌చేశారు. ఈ మేరకు గ్రామానికి చెందిన పెద్దలు, వేతనదారులు ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ కె.రామారావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలో మొత్తం 255 జాబ్‌కార్డులు ఉంటే అందులో 481 మంది వేతనదారులు నమోదై ఉన్నారు. వీరిలో 441 మంది వేతనదారులు మాత్రమే పనికి వెళుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రతి వారం ఒక్కొక్క వేతనదారు నుంచి రూ. 100 వంతున వసూలు చేస్తున్నారని తెలిపారు. గ్రామంలో లేని పనస భాస్కరరావు, పనస మవిత, బూరి రామారావు, బూరి గౌతమి, శివ్వాల గణేష్, శివ్వాల ధనలక్ష్మి, మజ్జి సతీష్, మజ్జి ప్రసన్నలక్ష్మి, చందక భుజంగరావు, చందక ప్రశాంతి, కరణం ఆదినారాయణ, కరణం గౌరీశ్వరి, చిన్ని గోపాలకృష్ణ, తదితరుల పేరున మస్తర్లు వేసి సగం డబ్బులు తీసుకుంటు న్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వేతనదారులకు ఇవ్వాల్సిన వేతన పుస్తకానికి రూ. 50 చొప్పున వసూలు చేసినట్టు పేర్కొన్నారు. ఈ గ్రామానికి చెందిన వై.శంకరరావు, శివ్వాల తవిటినాయుడు, వై.రాంబాబు, ఎస్.వెంకటరమణమూర్తి, ఎస్.తిరుపతి నాయుడు, చందక గౌరీశంకరరావు తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

ఉపాధి బకాయిలు చెల్లించాలి

● కురుపాం ఎంపీడీవో కార్యాలయం వద్ద గిరిజనుల ధర్నా



ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న గిరిజనులు

కురుపాం: ఉపాధి హామీ వేతనదారులకు పెండింగ్ ఉన్న బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ కురుపాం ఎంపీడీవో కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సంఘ జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ నెలల తరబడి బిల్లులు చెల్లించలేదన్నారు. ఈమేరకు ఏపీఓ పి.బావాజీకి వినతి పత్రం అందించారు. ఇదిలాఉండగా వబ్బంగి పంచాయితీ తోలుంగూడ, బడ్డడగూడ, తియ్యాలగూడ గిరిజన గ్రామాలకు మంచినీటి బోర్లు కావాలని కోరుతూ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకుడు మండగి శ్రీను, మాజీ ఎంపీటీసీ అడ్డమేశ్వరరావు, గిరిజనులు పాల్గొన్నారు.

ముగ్గురు కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

పాలకొండ:మండలంలోని గోపాలపురం, పనుకువలస, అవలంగి పంచాయతీ కార్యదర్శులు వి.సీతారాం, లక్ష్మయ్య, అనసూయలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్య క్రమంలో నిబంధనలు పాటించక పోవడంతో షోకాజ్ నోటీసులు చేసినట్లు పేర్కొన్నారు. రెండు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు.

ఔట్‌సోర్సింగ్ టీచింగ్ సిబ్బందిని ఆదుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ టీచింగ్ సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రొబ్బా లోవరాజు కోరారు. సోమవారం గుమ్మలక్ష్మీపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.15 సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో గిరిజన గురుకుల, పాఠశాల, కళాశాలల్లో పనిచేస్తున్న టీచింగ్ స్టాఫ్‌ను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీలో ఔట్‌సోర్సింగ్ పద్ధతి పనిచేస్తున్న పోస్టులు కలపడం వల్ల సుమారుగా 1600 కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందని తెలిపారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

ఏకలవ్య పాఠశాలలో సీట్లు పెంచాలి

గుమ్మలక్ష్మీపురం: గిరిజన ప్రాంతాల్లో ఉన్న ఏకలవ్య పాఠశాలలో విద్యార్థుల నమోదుకు సీట్లు పెంచాలని ఆదివాసీ రైట్స్ ఫోరం అధ్యక్షుడు లోవరాజు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఏకలవ్య పాఠశాలలో చేరడానికి గిరిజన విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు.

సీతంపేటలో డాక్టర్ల దినోత్సవం

సీతంపేట: సీతంపేట ఏరియా ఆసుపత్రిలో సోమవారం డాక్టర్ల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు డాక్టర్ రోగులకు అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు. కార్య క్రమంలో డాక్టర్లు గౌరీశంకర్, శ్రీనివాసరావు, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆరుగురికి గాయాలు

వీరఘట్టం: వీరఘట్టం పెట్రోల్ బంకు సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో చిదిమి, తూడి గ్రామాలకు చెందిన ఆరుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా రమేష్‌బాబు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం ఇన్‌చార్జి ఎంపీడీవోగా గొర్లి రమేష్‌బాబు నియమితులయ్యారు.రమేష్‌బాబు గతంలో గుమ్మలక్ష్మీపురంలో ఈవోపీఆర్డీ, సీనియర్ సహాయకులుగాను విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఆయన కురుపాంలో ఈవోపీఆర్డీగా విధులు నిర్వహిస్తూ గుమ్మలక్ష్మీపురం ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన జగదీష్‌కుమార్ గతనెల 30న పదవీ విరమణ చేశారు.

ఉద్యోగుల మృతికి సంతాపం

కురుపాం: కురుపాం మండలం రాస్తాకుంటుబాయి, గుమ్మ పంచాయితీ వీఆర్ఓగా విధులు నిర్వహిస్తున్న మండంగి గవరయ్యకు సోమవారం రాత్రి గుండెపోటు రావడంతో వెంటనే కురుపాం ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కురుపాం మలేరియా సబ్ యూనిట్ అధికారిగా విధులు నిర్వహిస్తు ఎస్.నారాయణరావు గుండెపోటుతో సోమవారం తెల్లవారు జామున మృతి చెందారు. ఆయన విజయనగరంలోని ఓ ప్రేవేట్ ఆసుపత్రిలో ఆరు రోజులుగా చికిత్స పొందుతున్నారు. ఆయనది గరివిడి మండలం బొండపల్లి గ్రామం. వీరి మృతికి రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

ఎవరిపైనా ఆధారపడక్కర్లేదు

●సామాజిక పింఛన్ల మొత్తాలు పెంపుతో లబ్ధిదారుల్లో ఆనందం

టీడీపీ ప్రభుత్వం సామాజిక పింఛన్ల మొత్తాన్ని పెంచడంతో ఇకపై కుటుంబసభ్యులతోపాటు ఏ ఒక్కరిపై ఆధారపడ క్కర్లేదని పలువురు లబ్ధిదారులు చెబుతున్నారు. సోమవారం జిల్లాలో పెంచిన సామాజిక పింఛన్ల మొత్తాన్ని అధికారులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు అందజేశారు. ఈ సం దర్భంగా చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు మాటిచ్చి నిలబెట్టుకున్నారని లబ్ధిదారులు ఆనందం వ్యక్తంచేశారు.

చంద్రబాబు మహా నాయకుడు



ఈ వయస్సులో ఏ పని చేసుకోలేం. మాకు పింఛన్ డబ్బులే ఆధారం. అలాంటి పింఛన్‌ను ఒక్కసారిగా నాలుగువేలు చేయటమే కాకుండా మరో మూడు వేలు అధనంగా ఇచ్చిన మహానాయకుడు చంద్రబాబు.చాలా ఆనందంగా ఉంది.

- ఎస్.సూరయ్య, బంగారమ్మకాలనీ, సాలూరు

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

సీతంపేట: మండలంలోని పులిపుట్టి పంచాయతీ రామగిరి క్షేత్రంలో మహావతార అనిమిష భగవాన్ 116వ జయంతి పురస్కరించుకుని సోమవారం సత్యాస్ ట్రస్టు అధ్యక్షుడు ఎస్.పి.పెంటయ్య ఆధ్వర్యంలో 200 మంది వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు పెంటయ్య, నవీన్‌కుమార్, రాజారావు, రామారావు, శ్యామ్ పాల్గొన్నారు.

పౌర సరఫరాల గోదాం తనిఖీ

భోగాపురం: భోగాపురంలోని పౌర సరఫరాల గోదాంను ఆర్డీవో సూర్యకుమారి సోమవారం తనిఖీ చేశారు. రికార్డుల ప్రకారం గోదాంలో సరిపడా సరుకులు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. సరుకులను సమయానుకూలంగా అందించేలా చూడాలని గోదాం సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్యామ్‌ప్రసాదు,సీఎస్‌డీటీ జగన్నాథరావు,ఆర్ఐ కిషోర్ పాల్గొన్నారు.

వేతనాలు అందించి ఆదుకోండి

● ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది



జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయ విభాగంలో విధులు నిర్వహిస్తున్న దిగువ స్థాయి ఉద్యోగులకు వేతనాలు అందించడంలో సంబంధిత అధికారులు జాప్యంచేస్తున్నారని, తక్షణమే అందించి ఆదుకోవాలని సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడుకు సిబ్బంది వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఏపీ సీఎన్ఎఫ్ ఫెడరేషన్ యూనియన్ అధ్యక్షులు వై.శ్రీరాములు, ఉపాధ్యక్షులు సీహెచ్ లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి ఎస్.ప్రసాద్, కార్యదర్శి కె.సురేష్ కుమార్‌లు మాట్లాడుతూ ఏపీ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న దిగువ స్థాయి సిబ్బందికి 18 నెలలుగా గౌరవ వేతనం అందించలేదన్నారు. డీపీఎం, సిబ్బందికి, ఎన్ఎఫ్ఏ కేడర్‌లో ఉన్న వారికి నెలవారీ చెల్లిస్తున్నారని తెలిపారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న తమ సమస్యలను పట్టించుకోని పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. 18 నెలలుగా గౌరవ వేతనం అందకపోవడంతో కుటుంబ పోషణ కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలను విడుదల చేసి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

కొమరాడ: కేంద్ర ప్రభుత్వం భారతదేశంలో కొత్తగా క్రిమినల్ చట్టాలను అమలులోకి తీసుకు వచ్చిందని ఎస్ఐ నీలకంఠం తెలిపారు. సోమవారం ఆయన చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక నుంచి భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధీనియం అనే చట్టాలు అమలులోకి వచ్చినట్లు తెలిపారు. చట్టాలలో ఉన్న శిక్ష, జరిమానాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు.

ఉపాధి వేతనాలు తక్షణమే చెల్లించాలి

కొమరాడ: ఉపాధి వేతనదారులకు బకాయిపడిన నాలుగు వారాల వేతనాలను తక్షణమే చెల్లించాలని సీపీఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం ఉపాధి హామీ పథకం ఏపీవో బాలకృష్ణకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు.



ఏపీవో బాలకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు